# విశాల భారతి

తెలుగు దినపత్రిక

1-3-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్

సంపుటి:4 సంచిక: 3


## భగ్గుమంటున్న ఇరాన్

జెన్ జడ్ ఆందోళనలు అధికార ప్రభుత్వాలకు వణుకుపుట్టిస్తున్నాయి
ఇటీవల శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రభుత్వాలనే మార్చేశాయి
మూసీని ప్రక్షాళన చేయాలనే విజన్ ఏమాత్రం లేదన్నారు
తాజాగా ఇరాన్‌లో కూడా జెన్ జడ్ ఆందోళనలు కొనసాగుతున్నాయి
కరెన్సీ విలువ పడిపోవడంతో అక్కడి ప్రజలు రోడ్లపైకి వచ్చారు
ఇరాన్ సెంట్రల్ బ్యాంకు గవర్నర్ కూడా రాజీనామా చేశారు

03






కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు.

# మూసీ మంటలు

### సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు






- మూసీ కంటే కొందరి కడుపులో ఉన్న విషం ప్రమాదకరమన్నారు
- వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ నిలదీశారు
- మూసీ సుందరీకరణపై మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు
- సుందరీకరణ కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో చెప్పాలని అన్నారు
- సంక్షేమానికి లేని డబ్బులు మూసీ సుందరీకరణకు ఎక్కడవని ప్రశ్నించారు
- మూసీ అభివృద్ధిని ఎప్పటి నుంచి ప్రారంభిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు
- రెండేళ్ల నుంచి మూసీ పేరుతో కాలం గడుపుతున్నారని విమర్శించారు

02

## కవిత కన్ఫ్యూజన్.. కోమటిరెడ్డి కౌంటర్

సీఎం అంటే గౌరవమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు
సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు
అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు
మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు
రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేశారు
కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు
కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ డిమాండ్ చేశారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్మునికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన అభివర్ణించారు. కవిత కన్ఫ్యూజన్‌లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్

మిగతా 2లో..



## జల వివాదాల పరిష్కారానికి కమిటీ

- తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం కొనసాగుతూనే ఉంది
- ఈ క్రమంలోనే జల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు
- జల్‌శక్తి శాఖ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది
- సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం
- గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు ఉన్నాయి
- ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వం వహించనున్నారు

02

## బీఆర్ఎస్ తప్పు మీద తప్పు?

అసెంబ్లీసమావేశాలను బాయికాట్ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది
ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుమీడియాకు తెలియజేశారు
స్పీకర్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా బాయ్ కాట్ చేస్తున్నామని తెలిపారు
సభలో మాట్లాడాల్సిన సమయంలో సెల్ఫ్ గోల్ వేసుకుంది
వాదనలను వినిపించుకోవాల్సిన సమయంలో వెనకడుగు
పాలమూరు ప్రాజెక్టు పేరుతోచేస్తున్న రాజకీయం వికటించింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బాయికాట్ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావు మీడియాకు తెలియజేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుందన్నారు. స్పీకర్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బాయ్ కాట్ చేస్తున్నామని మాజీ మంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ తీరు చూస్తుంటే శాసనసభ నిబంధనలకు విరుద్ధంగా ఉందని మండిపడ్డారు. బీఏసీ మీటింగ్‌కు ప్రభుత్వం తరపున గంటన్నర లేటుగా వచ్చారని.. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీని బూతులమయం చేశారని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మైక్ ఇవ్వరా అని ప్రశ్నించారు. పార్లమెంటులో మోదీని రాహుల్ గాంధీ తిట్టడంలేదా అని నిలదీశారు. అసెంబ్లీలో తాను సీఎం గురించి మాట్లాడితే తప్పు ఏంటి అంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లాగా, సీఎల్పీ మీటింగ్‌లాగా మార్చారంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ కంపు కంటే సీఎం నోటి నుంచి వచ్చే మాటల కంపు ఎక్కువంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా లేక స్ట్రీట్ రౌడీనా అని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి, నీళ్ల ద్రోహి అని.. కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు

మిగతా 2లో..



## హరీష్ రావు ఒక బచ్చా

- కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు
- అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ రాకపోవడాన్ని తప్పుబట్టారు
- సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతమని అన్నారు
- పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవు పలికారు
- కేసీఆర్ మీద సీఎం రేవంత్ రెడ్డి భాష సరికాదని విమర్శించారు
- హరీష్ రావును ఉద్దేశించి కవిత తీవ్రమైన ఆరోపణలు చేశారు
- ఒక బచ్చా, ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏమిరాదన్నారు

02

# యూరియా.. ఏదయా!


### యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

- పంపిణీ చేసేందుకు ఫెర్టిలైజర్ యాప్ వ్యవసాయ శాఖ తీసుకొచ్చింది
- యాప్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో రైతులు మండిపడుతున్నారు
- ఖమ్మంలోని కొనిజర్ల కేంద్రంలోని గ్రోమోర్ వద్ద రైతులు బారులు తీరారు
- చలిలో యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు
- యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా పంపిణీలో అక్రమాలను నిలువరించడంతో పాటు రేషన్ పద్ధతిలో ఒక్కో రైతుకు ఎకరాకు మూడు ఎకరాల మేర సక్రమంగా పంపిణీ చేసేందుకు 'ఫెర్టిలైజర్ యాప్'ను వ్యవసాయ శాఖ తీసుకొచ్చింది. ఈ యాప్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో రైతులు మండిపడుతున్నారు. పొలం నాట్ల సమయంలో యూరియాపై ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని కొనిజర్ల మండల కేంద్రంలోని గ్రోమోర్

మిగతా 2లో..



## చెంపలు వాయిస్తాం బిడ్డా

- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు
- రేవంత్ రెడ్డి కొండంత విషం పెట్టుకున్నాడని ఆరోపించారు
- మూసీని ప్రక్షాళన చేయాలనే విజన్ ఏమాత్రం లేదన్నారు
- కలుషితమైన మూసీ కన్నా రేవంత్ రెడ్డే ప్రమాదమని ఆరోపించారు
- అక్రమ సంపాదనకు అడ్డువస్తున్నామనే బీఆర్ఎస్‌పై కక్ష
- మూసీ బ్యూటిఫికేషన్ పేరిట భారీ దోపిడీ కోసం యత్నిస్తున్నారు

02



# జల వివాదాల పరిష్కారానికి కమిటీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. విభజన తర్వాత అన్ని సమస్యలకు పరిష్కారం చూపిన కేంద్రం.. నీటి వివాదంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తుంది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఏర్పడిన తెలంగాణకు నీటి పంపకాల విషయంలో తేడా వస్తే వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయో కేంద్రానికి బాగా తెలుసు. ఈ క్రమంలోనే జల వివాదాల పరిష్కారానికి జల్‌శక్తి శాఖ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జల వివాదాల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. ఈ కమిటీలో కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ చైర్మన్లు, సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూ డీఏ చీఫ్ ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన కమిటీని ఇవాళ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో



సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదాహరణకు.. కృష్ణానది జల వివాద పరిష్కారానికి 6 అక్టోబర్ 2023నాడు కెడబ్ల్యూడీటీ2ను ఏర్పాటుచేసి.. అడిషనల్ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌ను నిర్దేశించింది. రెండేళ్ల కాల వ్యవధి 1 ఆగస్టు, 2025 నాడు ముగిసింది. కృష్ణాజలాల వినియోగంపై వాదనలు నడుస్తోండటంతో దీన్ని మరో ఏడాది (31 జూలై, 2026) పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇలా తెలుగు రాష్ట్రాల జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తోంది.

కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని చాప్టర్ 9, సెక్షన్ 84 ప్రకారం.. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన విషయంలో సమస్యల పరిష్కారం కోసం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. 16, జూలై 2025 నాడు ఢిల్లీలో కేంద్ర జల వనరుల శాఖ (జల్‌శక్తి) మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో.. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రస్తావించగా.. వాటిని చర్చించి, సాంకేతికతంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. ఇందుకోసం ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని సూచించింది. డిసెంబర్ 23, 2025 నాడు తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయడంతో శుక్రవారం కేంద్ర జలవనరుల సంఘం కొత్త కమిటీని నోటిఫై చేసింది.

ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో తెలంగాణ నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి.. జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, జలవనరుల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటుగా.. కృష్ణానది యాజమాన్య బోర్డు హైదరాబాద్ చైర్మన్, గోదావరి నది యాజమాన్య బోర్డు చైర్మన్లు, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చీఫ్ ఇంజనీర్, సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజనీర్ కూడా సభ్యులుగా ఉండనున్నారు.

# యూరియా.. ఏదయా!

( మొదటిపేజీ తరువాయి )



రైతుసేవ కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. తెల్లవారుజామున మూడు గంటల నుండి క్యూ లైన్‌లోనే రైతులు వేచి చూస్తున్నారు. రాష్ట్ర రహదారి పక్కనే షాపు ఉండడంతో రోడ్డు పక్కనే రైతులు బారులుతీరారు. మరోవైపు.. వరంగల్ జిల్లాల్లోని నెక్కొండ (మం) అప్పలరావుపేటలో యూరియా బస్తాల కోసం తెల్లవారుజాము నుంచే రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. చలిలో యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ సందర్భంగా యూరియా బుకింగ్ కోసం ఫర్టిలైజర్ యాప్ పనిచేయడం లేదని రైతులు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరియా పంపిణీ కోసం 'ఫెర్టిలైజర్ యాప్'ను వ్యవసాయ శాఖ తీసుకొచ్చింది. దీని ద్వారా తొలుత ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద రైతులకు యూరియా బస్తాల పంపిణీ చేయాలని నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో 82,059 మంది రైతులు 2,01,789 యూరియా బస్తాలను కొనుగోలు చేశారు. మిగతా జిల్లాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నప్పటికీ, రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో వారి అవసరాలను బట్టి పట్టా పాస్‌పుస్తకం ఆధారంగా రేషన్ పద్ధతిలో సరఫరా చేయాలని నిర్ణయించారు. వరితో పాటు మొక్కజొన్న, ఇతర పంటలకు కూడా పంట విస్తీర్ణానికి అనుగుణంగానే యూరియా సరఫరా చేయనున్నారు.

రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ డిసెంబర్ 31 నాటికే 4.04 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు సరఫరా చేశామన్నారు. ప్రస్తుత 2025-26 యాసంగి సీజన్‌లో అక్టోబర్ నుంచి డిసెంబర్ 31 వరకు మొత్తం 4.04 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని, ఇది గత 8 సంవత్సరాల్లో అత్యధికమన్నారు. యాసంగిలో డిసెంబర్ వరకు కేంద్ర కేటాయింపులు 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను, ఇప్పటికే 5.78 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించుకోగలిగామని తెలిపారు. రైతులకు అవసరమున్నంతమేరకు యూరియా సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 12000 సెంటర్లలో, ఎక్కడో 2,3 సెంటర్లలో ఉన్న వరసలను చూపి రాజకీయ పబ్బం గడపాలని అనుకుంటున్నారని బీఆరెస్ నేతలనుద్దేశించి మంత్రి అన్నారు. ఆతృతతో రైతులు అక్కడక్కడ షాప్ ల ముందూ నిల్చున్న సందర్భాలను చూపి యూరియా కొరత అని ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని అనుకుంటే రైతులు క్షమించరన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న క్యూల సంగతి, ఆ క్యూలలో రైతులు మరణించిన సందర్భాల గురించి నేను మాట్లాడదల్చుకోలేదనిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది తీసుకొచ్చిన కిసాన్ యాప్ ను రాష్ట్రంలో కూడా అమలు చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. ఆ యాప్ ను ఉపయోగించిన పత్తి రైతులలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారన్నారు. వారంతా ఈ యాప్ ను ఉపయోగించి పత్తి అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. యాప్ ద్వారా యూరియా అమ్మకాలను 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా చేపట్టామన్నారు. నేను స్వయంగారైతులతో మాట్లాడితే వారంతా సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ప్రయోగాత్మక దశలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరించామన్నారు. యాప్ ద్వారా డిసెంబర్ 20వ తేది నుండి ఇప్పటివరకు 1.18 లక్షల మంది రైతులు 3.36 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేశారన్నారు. కౌలు రైతులకు, పట్టాలు లేని రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకొన్నామని మంత్రి సభకు వివరించారు. యాప్ మీద కూడా లేని పోని అపోహలు, గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేయడం దురదృష్ట కరమన్నారు. ఈ యాప్ ను తీసుకొచ్చే ముందు రైతులందరికీ అవగాహన కల్పించామని, ప్రతి రిటైల్ అవుట్ లెట్ దగ్గర ఒక వాలంటీర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# కవిత కన్ఫ్యూజన్.. కోమటిరెడ్డి కౌంటర్

( మొదటిపేజీ తరువాయి )



చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్‌రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

ఆర్ అండ్ బీ శాఖలో ఖాళీగా ఉన్న 265 ఇంజినీర్ల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఫీల్డ్‌లో ఉండే ఏఈలకు ల్యాప్ ట్యాప్‌లు అందిస్తామని చెప్పారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఆంధ్రా వాళ్లతో ఉన్న పెండింగ్ సీనియారిటీ సమస్యలను కూడా త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్ అండ్ బీ శాఖ కార్యాలయంలో ఆర్ అండ్ బీ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర పురోగతిలో రోడ్లు భవనాలు శాఖ కీలక భూమిక పోషిస్తున్నదన్నారు.

ఉద్యోగుల కోరిక మేరకు కొత్త సంవత్సరంలో అన్ని హంగులతో కూడిన ఆడిటోరియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గ్లోబల్ సమ్మిట్ వేదికగా చరిత్రలో ఎన్నడు లేని విధంగా మొదటి సారి ఆర్ అండ్ బీ రోడ్ పాలసీని ఆవిష్కరించుకున్నామని మంత్రి తెలిపారు. శాఖ విజన్‌కు ఇది నిదర్శనమన్నారు. మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, గ్రీన్ ఫీల్డ్ హైవేలు వంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలతో ఆర్ అండ్ బి శాఖ ముందుకు సాగుతోందని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో అతిపెద్ద డిపార్ట్‌మెంట్ ఆర్ అండ్ బీ అని కొనియాడారు. ఉద్యోగులందరూ అత్యంత నిబద్ధత, నిజాయతీ, బాధ్యతతో పనిచేసి శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. తమ శాఖ ఇంజనీర్లు, ఉద్యోగులు తనకు కుటుంబ సభ్యులతో సమానమని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి మంత్రి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రావు, బి.వి రావు, లింగారెడ్డి, వసంత్ నాయక్, నర్సింగ్ రావు, ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జనవరి 1వ తేదీ గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో జలాలు నిజాలు అంశంపై తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీలోని సీనియర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వల్లే తగ్గిదంటూ సీఎం రేవంత్ కాస్త ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై కవిత మండిపడ్డారు. కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# బీఆర్ఎస్ తప్పు మీద తప్పు?

( మొదటిపేజీ తరువాయి )



సీఎం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ఆరోపించారు. ప్రతి దానికి కమీషన్లు తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించి తప్పు చేసిందనుకోవాలి. కృష్ణా నదీ జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల విషయంపై సభలో మాట్లాడి నిజాలను తెలియజేయాల్సిన సమయంలో బీఆర్ఎస్ సమావేశాలను బహిష్కరించి ఒకరకంగా సెల్ఫ్ గోల్ వేసుకుంది. తన వాదనలను వినిపించుకోవాల్సిన సమయంలో వెనకడుగు వేసి తాను ఈ ప్రాజెక్టు విషయంలో సరైన వాదనలు వినిపించలేక చేతులెత్తేసిందన్న కామెంట్స్ ను ఎదుర్కొనాల్సి వచ్చింది. పాలమూరు ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న రాజకీయం ఇప్పుడు వికటించింది. తెలంగాణ నీటి ప్రయోజనాలను బీఆర్ఎస్ రాజకీయం కోసం రిస్క్ లో పెడుతోందన్నది ఎక్కువ మంది అభిప్రాయం. పాలమూరుపై ప్రేమ ఉన్నట్లుగా చూపిస్తూ అసలే పనులు జరగకుండా చేస్తోందంటున్నారు. ప్రాజెక్టు ముందుకెళ్లాలంటే అనుమతులు, నిధులు అవసరం ఉంటుంది. కేసీఆర్ చేయగలిగినంత అప్పు చేసి కాళేశ్వంర మీద పెట్టుబడి పెట్టి వెళ్లారు. మరి పాలమూరు రంగారెడ్డి పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న సహజంగా తలెత్తుంది. ఎనభై వేల కోట్ల ఖర్చులో 27వేల కోట్లు ఖర్చు మాత్రమే పెట్టారని, ఆలస్యమయ్యే కొద్దీ అంచనాలు పెరుగుతూంటాయి. ప్రభుత్వం ఇప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకుంటోంది. కానీ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు సామర్థ్యం, నీటి కేటాయింపులు, రుణాల సేకరణపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అటు అభివృద్ధికి, ఇటు రాజకీయ యుద్ధానికి వేదికవుతున్నాయి. ప్రభుత్వ రికార్డుల్లో ప్రాజెక్టును 45 టీఎంసీల సామర్థ్యంతో చూపడం వెనుక బలమైన ఆర్థిక, సాంకేతిక కారణాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందాలన్నా, కేంద్రం నుంచి పర్యావరణ , జలవనరుల అనుమతులు వేగంగా రావాలన్నా క్లీన్ అండ్ క్లియర్ ప్రాజెక్టుగా ఉండటం అవసరం. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై పెట్టిన భారీ పెట్టుబడులను, పాత అప్పులను తక్కువ వడ్డీ రేట్లకు మార్చుకోవడం ద్వారా ఖజానాపై భారం తగ్గించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 45 టీఎంసీల వాదన తీసుకు వచ్చింది.

# చెంపలు వాయిస్తాం బిడ్డా


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తన అక్రమ సంపాదనకు అడ్డువస్తున్నారని కడుపులో రేవంత్ రెడ్డి కొండంత విషం పెట్టుకున్నాడని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి నరనరాన విషం తప్ప మూసీని ప్రక్షాళన చేయాలనే విజన్ ఏమాత్రం లేదని తెలిపారు. కలుషితమైన మూసీ కన్నా రేవంత్ రెడ్డి ఉపయోగించే భాష నుంచే ఎక్కువ కంపు కొడుతోందని ధ్వజమెత్తారు. తన అక్రమ సంపాదనకు అడ్డువస్తున్నారని బీఆర్ఎస్ పార్టీపై, మూసీని వ్యతిరేకిస్తున్న ప్రజలపై కడుపులో కొండంత విషం పెట్టుకున్నాడని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.



డీపీఆర్ సిద్ధం కావడానికి ఇంకా ఏడాది పడుతుందని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందే రూ.లక్షన్నర కోట్లు వ్యయం ఎట్లా చెప్పారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. డీపీఆర్ కూడా సిద్ధం కాకముందే బుల్‌డోజర్లతో పేదల ఇళ్లను ఎందుకు కూల్చినట్టో సమాధానం చెప్పాలని కేటీఆర్ సవాల్ చేశారు. మూసీ లూటిఫికేషన్ పేరిట భారీ దోపిడీ కోసం బ్లాక్ లిస్టులో పెట్టిన మెయిన్ హార్ట్ అనే కంపెనీకి కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయిన కంపెనీకి కాంట్రాక్టు ఎలా ఇస్తారని కేటీఆర్ సూటి ప్రశ్నించారు. మూసీని అనుకుని నివసించే లక్ష మందికి పైగా ప్రజల ఇళ్లను కూల్చి త్వరలోనే వారిని రోడ్డున పడేస్తామని అధికారికంగా ప్రకటించారని గుర్తుచేశారు. దశాబ్దాలపాటు నల్గొండ జిల్లా ప్రజలను మూసీ మురికితో ఇబ్బందుల పాలుచేసిన పాపం కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ వంటి ప్రతిష్ఠాత్మక పథకంతో నల్గొండలో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని కేటీఆర్ ప్రకటించారు. గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి ముందుగా అవి కాళేశ్వరం నీళ్లా కాదా? చెప్పి ముక్కు నేలకు రాయాలని రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ సంచలన సవాల్ చేశారు. 'పరిపాలన అంటే రియల్ ఎస్టేట్ దందా మాత్రమే అని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు. బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే అతితక్కువ ఖర్చుతో మూసీ పునరుజ్జీవం కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం' అని కేటీఆర్ గుర్తుచేశారు. ఆసక్తి చూపిన 9 కంపెనీలు అన్నిరకాల డిజైన్లు సిద్ధం చేశాయని, వడ్డించిన విస్తరి లాంటి ప్రాజెక్టును పక్కనపెట్టి మళ్లీ కమిషన్ల కోసం కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. 'దాదాపు రూ.16 వేల కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆ అంచనాలను రూ.లక్షన్నర కోట్లకు పెంచి అతిపెద్ద కుంభకోణానికి తెరతీశారు. రూ.1,100 కోట్లతో కొండ పోచమ్మ సాగర్ నుంచి గండిపేటకు కాళేశ్వరం నీళ్లను తరలించాలని ప్రణాళికలు రచిస్తే.. ఇప్పుడు అంచనాలు అమాంతం పెంచి దండుకోవాలని చూస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డును కనెక్ట్ చేసేలా ఎక్స్‌ప్రెస్ వే ప్రణాళిక కూడా గతంలోనే సిద్ధం చేశాం' అని మాజీ మంత్రి కేటీఆర్ వివరించారు. మూసీలోకి చేరే 2000 ఎంఎంఎల్డీ మురుగునీటి శుద్ధి కోసం 36 ఎస్టీపీల నిర్మాణం పూర్తిచేశామని వెల్లడించారు.

# మూసీ మంటలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. మానవ నాగరికత నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి చెందిందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు నిర్మించారు. 1908 లో నగరాన్ని వరద ముంచెత్తితే... వరద సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించింది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. ఆగర్భ శ్రీమంతుల ఫామ్ హౌజుల డ్రైనేజీలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో కలుపుతుంటే ఉక్కు పాదం మోపామన్నారు. ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకున్నాయి. లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్ జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ లాంటి దేశాలను పర్యటించామన్నారు. ప్రపంచ నగరాలు అభివృద్ధి చెందుతున్న విధానాలను చూశాక మూసీలో శుద్ధమైన నీరు ప్రవహించాల్సిందేనని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కన్సల్టెన్సీలను అపాయింట్ చేసుకుని మూసీ ప్రక్షాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని



ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల కలుషితాల నుంచి జంతువుల కళేబరాల వరకు మూసీలో కలుస్తున్నాయన్నారు. మూసీ పరీవాహక ప్రాంత మహిళలు గర్భం దాల్చలేకపోతున్నారని వైద్యులు చెప్పిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అందుకే గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 20 టీఎంసీలలో లలో 15 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, 5 టీఎంసీలు మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు పాటించేందుకు ఉపయోగించాలనుకుంటున్నామన్నారు.

గుజరాత్ సబర్మతీ నది ప్రక్షాళన సమయంలో 60 వేల కుటుంబాలను తరలించారు, ఉత్తర్ ప్రదేశ్ లో గంగా నది ప్రక్షాళన చేసి రివర్ ఫ్రంట్ కట్టుకున్నారు, బీజేపీ నాయకులు వాటిని అభివృద్ధి మంత్రంగా ప్రచారం చేసుకున్నారు అయినా మేం వాటిని వ్యతిరేకించలేదు... తప్పుపట్టడం లేదని సీఎం అన్నారు. మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన చోట బాపూ ఘాట్ నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ రెండు నదులు కలిసే చోట వీ షేప్‌లో అభివృద్ధి జరుగుతోంది. మూడు నదుల సంగమంగా బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ను అభివృద్ధి చేయబోతున్నామని, మార్చి 31 లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు వేసి అభివృద్ధి చేయాలనుకుంటున్నామని స్పష్టం చేశారు.

ఏడీబీ బ్యాంకు రూ. 4 వేల కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించింది, గాంధీ సరోవర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతించింది. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఓల్డ్ సిటీని మేం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు, ఓల్డ్ సిటీ ఒరిజినల్ సిటీ.. ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కొంతమంది నన్ను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారు, రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీనే అని అన్నారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారు, రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతున్నది. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని సీఎం అన్నారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమైనదని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నేను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారని ఆయన మండిపడ్డారు. నిజాలు ప్రజలకు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారన్నారు. మూసీ సుందరీకరణపై మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్ళు కూలగొట్టద్దని అన్నారు హరీష్ రావు. మూసీ సుందరీకరణ కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో చెప్పాలని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు నిధులు లేవంటున్న ప్రభుత్వానికి మూసీ ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తుందో చెప్పాలని అన్నారు. మూసీ సుందరీకరణ కోసం ఒకసారి లక్ష కోట్లు, మరొకసారి లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని అంటున్నారని అన్నారు హరీష్ రావు. మూసీకి గోదావరి నీళ్లు తెస్తామని ప్రభుత్వం అంటోందని.. వాటి టేకింగ్ పాయింట్ ఏంటని ప్రశ్నించారు హరీష్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తెస్తారా..?, ఇంకెక్కడి నుంచైనా తెస్తున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మూసీలోకి మురికి నీరు రాకుండా 32 ఎస్టీపీలు తెచ్చామని... ఇప్పుడు ఆ ఎస్టీపీలు పనిచేయకపోవడంతో వికారాబాద్ మురికి నీరు గండిపేట హిమాయత్ సాగర్ లోకి వస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా అని ప్రశ్నించారు హరీష్ రావు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్ళు కూల్చితే బీఆర్ఎస్ ఊరుకోదని.. అవసరమైతే బుల్డోజర్లకు అడ్డంగా పడుకుందామని గతంలోనే చెప్పామని అన్నారు హరీష్‌రావు.

మూసీ అభివృద్ధిని ఎప్పటి నుంచి ప్రారంభిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ. మూసీ ప్రాజెక్ట్ వివరాలను ఇప్పటి వరకు ఎందుకు చెప్పడం లేదని పలు ప్రశ్నలు సంధించారు. ఆయన ప్రశ్నలకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. సభలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. మూసీకి, మీర్‌అలాంకు సంబంధమేంటి?. రెండు మూడు అంశాలను క్లబ్ చేస్తే ఎలా?. అసెంబ్లీ అధికారులు విధులను సరిగ్గా నిర్వర్తించడం లేదు. సభ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. రెండేళ్ల నుంచి మూసీ పేరుతో కాలం గడుపుతుంది ఈ ప్రభుత్వం. మూసీ డెవలప్‌మెంట్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారు.. అసలు మూసీ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉంది?. మూసీ ప్రాజెక్ట్ బాబు ఘాట్ వరకు ఉందని విన్నాను.. కానీ ప్రాజెక్టు వివరాలు సర్కార్ చెప్పడం లేదు. నాకు తెలిసినంత వరకు అనంతగిరి నుంచి మూసీ ప్రారంభం అవుతుంది. ప్రభుత్వం అనంతగిరి నుంచి ప్రాజెక్ట్ తీసుకుంటుందా? లేదా?. మూసీలో ప్రైవేట్ ల్యాండ్ ఎంత ఉంది?. గోదావరి నీళ్లను హిమాయత్, ఉస్మాన్ సాగర్‌లోకి ఎలా తెస్తారు?. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ క్యాచిమెంట్ ఏరియా ఎంతో చెప్పాలి?. గతంలో అవసరం లేకుండా హిమాయత్, ఉస్మాన్ సాగర్ గేట్లు తెరిచారు?. ఈ రెండు సాగర్లలో వర్షపు నీళ్లు వస్తాయి.. మరి గోదావరి నీళ్లు తెస్తే ఎలా? అని ప్రశ్నించారు. మరోవైపు.. అక్బరుద్దీన్ ప్రశ్నలకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానమిస్తూ..'మూసీ అభివృద్ధి ప్రాజెక్టును ఎంఆర్‌డీసీఎల్ చేపడుతుంది. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు మూసీ అభివృద్ధి ప్రాజెక్టు జరుగుతుంది. ప్రణాళిక, విశ్లేషణ, డిజైన్‌పై 18 నెలల్లో డీపీఆర్ సమర్పిస్తుంది. నల్లగొండ జిల్లా సాగు నీరుకు మూసీ నది ఉపయోగం. మూసీ పునరుజ్జీవనం జరగాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటున్నారు. మూసీ నది జంట నగరాలకే కాదు.. రాష్ట్రానికి సంబంధించిన అంశం. మీరాలం ఫీడెడ్ చానెల్ మూసీతో అనుసంధానమై ఉంది' అని చెప్పుకొచ్చారు.

# హరీష్ రావు ఒక బచ్చా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో కవిత మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవు పలికారు. అలాగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరి తీయాలంటే, రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారామె. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్నని ప్రశ్నించారు కవిత. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును ఉద్దేశించి కవిత మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. హరీష్ రావు ఒక బచ్చా అని అన్నారు. ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏం తెలుసంటూ హరీష్‌ను టార్గెట్ చేస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని.. కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబర్ 3న తాను రాజీనామా చేశానని.. నాలుగు నెలల కాలంలో అనేక సమీకరణాలు జరిగాయని ఈ సందర్భంగా తెలిపారు కవిత. తనకు మాట్లాడే అవకాశాలు ఇవ్వాలని సభకు వచ్చినట్లు చెప్పారు. ఒక ఫైల్.. భట్టి దగ్గరకు వస్తే నెలల తరబడి ఉంటుందని.. ఎందుకు ఇంత అలసత్వమని ప్రశ్నించారు. సభా అవకాశాల దృష్ట్యా తాను తన రాజీనామా అంశాన్ని మండలి చైర్మన్ దగ్గర ప్రస్తావిస్తానని అన్నారు. చాల గ్రామాల్లో అన్ని పార్టీలు కలిసి పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేశాయని.. అందుకే ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదని తెలిపారు. అక్కడక్కడా మోదీ, కేసీఆర్ ఫోటోలు పెట్టినట్లు తెలిపారు. కొన్నిచోట్ల జాగృతి తరపున కూడా గెలిచారని చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఏదో కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. పరోక్ష పద్ధతిలో ఈ ఎన్నికల్లో సర్పంచ్‌ల ఓట్లు వేసేలా కుట్ర జరుగుతోందని.. త్వరలో దీన్ని బయటపెడతామని స్పష్టం చేశారామె.



సభలో హరీష్ వర్సెస్ రేవంత్ రెడ్డిల మధ్య వార్ ఉండనుందని కవిత చెప్పుకొచ్చారు. ఇది మరోసారి బీఆర్ఎస్‌కు బలమైన ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. బబుల్ షూటర్ వచ్చి సభలో మాట్లాడితే పార్టీ బద్నామ్ అవుతుందంటూ ఎద్దేవా చేశారు. ఒక్కసారి కేసీఆర్ సభకు వచ్చి వివరణ ఇస్తే బాగుటుందని ఆమె అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌కు, తనకు సంబంధం లేదని.. ఇక ముందు ఉండబోదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎందుకు సభకు రావడం లేదో తనకు తెలీదని.. గత నాలుగు నెలలుగా కేసీఆర్‌తో మాట్లాడలేదని చెప్పారు. ఇక్కడ ఫిక్స్‌డ్ మ్యాచ్ నడుస్తోందని ఆరోపించారు. అది సభా వేదికగా బయటపడిందన్నారు. నీటి వాటాల అంశంలో కేసీఆర్ ఒక్కరే సమాధానం చెప్పగలరని.. హరీష్ రావుకు అవకాశం ఇవ్వడం అనేది సరైంది కాదని కవిత పేర్కొన్నారు.

నీటి ప్రాజెక్టుల పై కేసీఆర్ కంటే రేవంత్, హరీష్‌కు ఎక్కువ తెలుసా అని కవిత ప్రశ్నించారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవుపలికారు. ఈ విషయంలో ఒక కూతురుగా తన రక్తం ఉడుకుతోందన్నారు. అలాగే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు.

## ఉన్నతమైన ఆలోచనలతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభిద్దాం

- తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు



**భద్రాచలం, విశాలభారతి:** ఉన్నతమైన ఆలోచనలతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించాలని భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలలో తాసిల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం లో జరిగిన అనుభవాలను తీసుకొని భవిష్యత్తుపై ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని కోరారు. భద్రాచలం రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనటం అభినందనీయమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం లో రేషన్ డీలర్ల కీలకపాత్ర అని ఎమ్మార్వో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబిఏ పథకం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కొత్తగా కార్డులు పొందిన ప్రతి కుటుంబానికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సందీప్ పట్టణ రేషన్ డీలర్స్ పండు తదితరులు పాల్గొన్నారు

## కంట్రీ ఛాంపియన్‌షిప్ గెలుపొందేన భద్రాద్రి జిల్లా అథ్లెట్లు

- అభినందించిన జిల్లా క్రీడా అధికారి ఎం.పరమధామరెడ్డి



**పాల్వంచ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అద్వర్యంలో హైదరాబాద్,గచ్చిబౌలి అథ్లెటిక్స్ స్టేడియం లో గురువారం ముగిసిన రాష్ట్రా క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ లో భద్రాద్రి జిల్లా అథ్లెట్లు 19 మంది బాలికలు 10 కిలోమీటర్లు పరుగుపందెం విభాగంలో 25 పాయింట్లు సాధించి ఛాంపియన్‌షిప్ గెలుపొందారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తేలిపారు. మహిళాల 10 కిలోమీటర్లు పరుగుపందెంలో పాల్వంచ కు చెందిన ఉషారాణి,అకంపాలెంకు చెందిన టబు, పాల్వంచకు చెందిన హర్షిత, శ్యామల ,మొదటి 10 స్తనలలో మెరుగయన ఫలితాలు సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని ,అంతేకాక భద్రాచలం కు చెందిన సరిత, కాచనపల్లి కి చెందిన దుర్గ. బాలికల 2 కిలోమీటర్లు పరుగుపందెంలో ముడు, అయిదు స్తానాలు సాధించారు అని తెలిపారు.ఈ సందర్భముగ క్రీడాకారుల ను మరియు కోచ్ లు నాగేందర్, యెర్రయ్య, నాగరాజు, శి లను భద్రాద్రి జిల్లా క్రీడా అధికారి ఎం.పరంధామరెడ్డి,రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు జి.రాధాకృష్ణ,జాతియ్ కోచ్ నాగపురి రమేష్,స్పోర్ఆథర్టీ కోచ్ శ్రీనివాస అభినందించారు.

## నూతన సంవత్సర బహుమతుల పంపిణీ




**మణుగూరు, విశాలభారతి :** గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా 600 మంది విద్యార్థులకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రేస్ క్యాంపస్‌లో గ్రేస్ సంస్థల అధినేత పి. జాకబ్ అధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జి .స్వర్ణ జ్యోతి హాజరై విద్యార్థులకు నూతన సంవత్సర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, నూతన సంవత్సరాన్ని లక్ష్యసాధనతో ప్రారంభించాలని సూచించారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన గ్రేస్ యాజమాన్యాన్ని అభినందించారు. ఇంకా ఆమె మాట్లాడుతూ ప్రార్థించే పెదవులకన్న ఆదరించే చేతులు మిన్న అని సమాజానికి పేద ప్రజలకు విద్యార్థుల కు గ్రేస్ సర్వీస్ సొసైటీ సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇతర అతిథులు మాట్లాడుతూ, గ్రేస్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇలాగే నిర్వహించాలని వారికి మా తరుపున చేయగలిగిన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు గ్రేస్ క్యాంపస్ ఇంచార్జ్ మాథ్యూ పుల్లారావు,గ్రేస్ మిషన్ స్కూల్ ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు, గ్రేస్ ఐ టి ఐ సిబ్బంది విద్యార్థులు గ్రేస్ సర్వీస్ సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## సౌండ్ పెంచితే.. వైర్లు కట్

- నేరెడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్
- డీజే సౌండ్ బాక్సులను సీజ్ చేసిన పోలీసులు



**నేరెడ్మెట్, విశాలభారతి:** ఇష్టం వచ్చినట్లు డీజే సౌండ్ పెంచి ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తే వైర్లు కట్ చేసి, సీజ్ చేస్తామని హెచ్చరించారు నేరెడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గురువారం రాత్రి 11 గంటల సమయంలో జేజే కాలనీవాసి తన భార్య భర్తడే సందర్భంగా పెద్ద ఆమ్ప్లి ఫైర్ అండ్ సౌండ్ బాక్స్ ట్రాన్స్పోర్ట్ ఆటోలో పెట్టి పెద్ద మొత్తంలో సౌండ్ పొల్యూషన్ చేస్తున్నారు. అయితే అటుగా వెళ్లిన పెట్రోలింగ్ సిబ్బంది సౌండ్ సిస్టం ఆపరేట్ చేస్తున్న వ్యక్తిని, ఆర్గనైజర్ లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగ సిఐ మాట్లాడుతూ రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి సౌండ్ పొల్యూషన్ కి పర్మిషన్ లేదని, ఫంక్షనల్ హాల్లకు కూడా పర్మిషన్ లు ఉండవన్నారు. సౌండ్ పొల్యూషన్ వస్తే ఆర్గనైజర్ పై, సౌండ్ సిస్టం ఆపరేటర్ పై మాత్రమే కాకుండా ఫంక్షనల్ యాజమాన్యం, మేనేజర్లపై కూడా క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేస్తామని హెచ్చరించారు.

## సీఎంకి నూతన సంవత్సర శుభాకాంక్షలు

- తెలిపిన టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్



**మొయినాబాద్, విశాలభారతి:** నూతన సంవత్సరం పురస్కరించుకొని శుక్రవారం నగరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టీపీసీసీ అధికార ప్రతినిధి, నక్కలపల్లి వాసి గౌరీ సతీష్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, మంచి ఆలోచనలతో జీవితాలను మార్చుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధినే ధ్యేయంగా తీసుకుని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నక్కలపల్లి గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బావిలో పడి యువతి మృతి

**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో ప్రమాదవశత్తు బావిలో పడి యువతి మృతి చెందిన సంఘటన శుక్రవారం గూడూరు మండలంలో ఏర్పడింది. ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని తేజావత్ రామ్ సింగ్ తండా గ్రామ పంచాయతీ శివారు తిట్టి తండ కు చెందిన గుగులోత్ అఖిలా (19) అనే యువతి పదో తరగతి వరకు చదువుకొని. తల్లి తండ్రులకు వ్యవసాయ పనులు చేదోడువాదులుగా ఉండేది. తండ్రి సూర్యతో కలిసి మేకలను మేపడానికి వెళ్లి ప్రమాదవశత్తు వ్యవసాయ బావిలో జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న గూడూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# హైకోర్టునే తప్పుదోవ

- పట్టించిన ఓ సీనియర్ అసిస్టెంట్" – ఆర్టీఐ ద్వారా ఆలస్యంగా వెలుగులోకి
- హైకోర్టు దృష్టికి రాని నిజాలు – ప్రభుత్వ కౌంటర్‌పైనే తీవ్ర సందేహాలు
- ఆర్&ఆర్ అస్తవ్యస్తం – కబ్జాలు, నష్టపరిహారాల్లో గందరగోళం
- అధికార అహంకారం – సీనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ డిమాండ్

**సత్తుపల్లి, విశాలభారతి:** W.P. No.1174/2021గా తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులో ప్రభుత్వం తరపున దాఖలైన కౌంటర్ అఫిడవిట్ కీలక వాస్తవాలను దాచిపెట్టిందన్న ఆరోపణలతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కీలక ఫైళ్లు, నివేదికలు ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) ద్వారా మాత్రమే ఆలస్యంగా వెలుగులోకి రావడం అనుమానాలకు మరింత బలం చేకూర్చిందని గ్రామస్తులు అంటున్నారు. బాధ్యత వహించాల్సిన ఒక సీనియర్ అసిస్టెంట్‌పై తక్షణ చర్యలు తీసుకుని, ఫ్రెష్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని, అలాగే ఆయన్ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


**హైకోర్టు కేసులోనే నిజాల దాచివేత?**

ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, కొమ్మేపల్లి గ్రామానికి చెందిన సింగరేణి జేవీఆర్ ఓసి-2 భూ నిర్వాసితుల కోసం మంజూరు చేయబడిన ఆర్&ఆర్ ప్యాకేజీల అంశం రాష్ట్రస్థాయిలో చర్చకు దారితీస్తోంది. కొమ్మేపల్లి గ్రామంలో భూ నిర్వాసితులకు ఆర్&ఆర్ ప్యాకేజీ కింద రూ.7.61 లక్షల నష్టపరిహారంతో పాటు 0-02 కుంటల ఇండ్ల స్థలాన్ని మంజూరు చేసే క్రమంలో ఆర్&ఆర్ సెంటర్ అయ్యగారిపేటలో 244 ఇండ్ల స్థలాలు మంజూరు చేశారు. మొదటి విడతగా 2018లో 229 మందికి నష్టపరిహారం చెల్లించి, ఒక్కొక్కరికి 0-02 కుంటల ఇండ్ల స్థలాలను కేటాయించగా, మిగిలిన 15 ఇండ్ల స్థలాల కేటాయింపుల కోసం అర్హుల ఎంపిక జరగాల్సి ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఈ క్రమంలోనే అక్రమంగా ఆర్&ఆర్ ప్యాకేజీ పొందాలని ప్రయత్నించిన 12 మందిని సత్తుపల్లి మండల తహశీల్దార్ 2016లోనే అనర్హులుగా గుర్తించి తొలగించారని, ఆ సమయంలో రాజకీయ ఒత్తిడుల కారణంగా ఆ 12 మందిని మళ్లీ ఎంపిక చేయడానికి ప్రయత్నాలు జరగగా గ్రామ యువకులు అభ్యంతరాలు తెలపడంతో ఆ ఎంపిక ప్రక్రియ నిలిచిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. అదే సమయంలో అర్హులైన కొందరు యువతుల ఎంపికలో రెవెన్యూ అధికారులు అవసరమైన ఆధారాల సేకరణలో జాప్యం చేయడంతో వారి ఎంపిక ప్రక్రియ నేటికీ పెండింగ్‌లోనే ఉందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో W.P. No.1174/2021లో పిటిషనర్లుగా ఉన్న 12 మంది తమ అర్హత పునఃపరిశీలన కోసం 26082020న దరఖాస్తు చేయగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో స్థాయిలో విచారణ జరిగింది. 31122020న సమర్పించిన విచారణ నివేదికలో ఆ 12 మంది పిటిషనర్లు కొమ్మేపల్లి గ్రామానికి చెందినవారు కాదని, ఆర్&ఆర్ ప్రయోజనాలకు అర్హులు కాదని స్పష్టంగా తేలిందని గ్రామస్తులు చెబుతున్నారు. 2016 పి.ఎ.ఎఫ్ జాబితా ప్రకారం కోర్టు కేసులో ఉన్న 12 మందిలో 6 మంది అప్పటికే ఆ జాబితా నుంచి తొలగించబడినవారిగా, మరో 6 మంది అసలు ఆ జాబితాలోనే లేరని అధికారికంగా నిర్ధారణ అయినప్పటికీ, ఈ కీలక అంశాలను ప్రభుత్వ కౌంటర్ అఫిడవిట్‌లో ప్రస్తావించకుండా పిటిషనర్లకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కృషి చేస్తున్నాడని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్తుల మాటల్లో, ఈ నివేదికలు మరియు ఫైళ్లు ఆర్టీఐ ద్వారా పొందిన తర్వాతే ఈ బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందనీ, ఆ నివేదికలను అప్పుడే హైకోర్టు ముందు ఉంచి ఉంటే కేసు దిశ పూర్తిగా మారిపోయేదని, కోర్టులో కూడా వారు అనర్హులుగా గుర్తించబడేవారని ఆశాభావం వ్యక్తం చేశారు.



కౌంటర్ అఫిడవిట్‌లో ఈ వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా వదిలేయడం వల్ల న్యాయ ప్రక్రియపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తూ, నేటికీ W.P. No.1174/2021 కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తాజాగా వాస్తవ ఆధారాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఇంత అన్యాయానికి ఒడిగట్టిన సీనియర్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కల్లూరు సబ్-కలెక్టర్‌కు పిర్యాదు చేశామని గ్రామస్తులు పేర్కొన్నారు.

అంతేకాకుండా, అసలైన ఆర్&ఆర్ ప్యాకేజీకి అర్హులైన యువతులు తమ ఎంపిక ఫైళ్ల విషయంలో సదరు సీనియర్ అసిస్టెంట్ కారణంగా గత ఏడేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయం గురించి కూడా ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు జనవరిలో ఫిర్యాదు చేశారనీ, ఈ ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని ఆర్డీవో / సబ్-కలెక్టర్ కార్యాలయం కల్లూరుకు మార్చి 2025లో ఆదేశాలు జారీ అయినప్పటికీ, నేటికీ సంబంధిత ఫైళ్లు అదే సీనియర్ అసిస్టెంట్ సెక్షన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 'అన్నీ నా చేతుల్లోనే' అన్న ధోరణితో వ్యవహరిస్తూ అర్హులైన యువతులను అనర్హులుగా చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆర్ అండ్ ఆర్ కాలనీలో అక్రమ కబ్జాలు – నోచుకోని విచారణ?**

ఇదే సీనియర్ అసిస్టెంట్ అండ ఉందనే ధైర్యంతో W.P. No.1174/2021లో ని 12 మంది పిటిషనర్లు కొమ్మేపల్లి ఆర్&ఆర్ సెంటర్‌లో ఇండ్ల స్థలాలను అక్రమంగా కబ్జా చేశారని గ్రామస్తులు మరో తీవ్రమైన ఆరోపణ చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణ జరగలేదని, కబ్జా చేసిన స్థలాలను రికవరీ చేయకుండా వారికే సహకరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఈ రెండు గ్రామాల సమస్యే ఇలా ఉంటే మిగతా భూసేకరణ కోర్టు కేసులో పిటిషనర్లతో లాలూచీ పడి ప్రభుత్వాన్ని తప్పు దోవ పట్టించుంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తూ "ఇది ఒక్క లింగపాలెం లేదా కొమ్మేపల్లి సమస్యే కాదు... కోర్టుల ముందు ప్రభుత్వ నిజాయితీకి సంబంధించిన విషయం" అని నియోజక వర్గ ప్రజానీకం పదేపదే మొత్తుకుంటుంది.

## భగ్గుమంటున్న ఇరాన్



**విశాలభారతి, నేషనల్:** మధ్యకాలంలో జెన్ జడ్ ఆందోళనలు అధికార ప్రభుత్వాలకు వణుకుపుట్టిస్తున్నాయి. ఇటీవల శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో చెలరేగిన నిరసనలు ప్రభుత్వాలనే మార్చేశాయి. తాజాగా ఇరాన్‌లో కూడా జెన్ జడ్ ఆందోళనలు కొనసాగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, కరెన్సీ విలువ పడిపోవడంతో అక్కడి ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ముందుగా దేశరాజధాని టెహ్రాన్‌లో ఈ నిరసనలు ప్రారంభం కాగా ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఆర్థిక సంక్షోభంతో ఇరాన్ సెంట్రల్ బ్యాంకు గవర్నర్ కూడా రాజీనామా చేశారు. గత ఆరు రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రస్తుతం తీవ్ర రూపం దాల్చాయి. షియా మతాధికారుల కోట అయిన కోమ్‌కు చేరుకున్నాయి. దీంతో భద్రతా దళాలు అడ్డుకునేందుకు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. పలుచోట్ల ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగిస్తున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అంతేకాదు ప్రభుత్వం ఆందోళనకారులను చర్చలకు పిలిచింది. కానీ ప్రయోజనం లేదు. ఏకంగా 10 యూనివర్సిటీల విద్యార్థులు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. సుప్రీం లీడర్ ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. నియంతలకు మరణశిక్ష విధించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఏకంగా 40 శాతానికి చేరింది. దీంతో నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోయాయి. బుధవారం నాటికి ఒక అమెరికన్ డాలరు విలువ ఏకంగా 1.38 మిలియన్ రియాల్స్‌గా ఉండటం గమనార్హం. 2022లో సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మహమ్మద్ రెజా ఫర్జిన్ బాధ్యతలు చేపట్టినప్పుడు ఆ కరెన్సీ విలువ 4,30,000గా ఉండేది. మూడేళ్లలోనే దాని విలువ భారీగా పతనం అయ్యింది. ఈ క్రమంలోనే అక్కడి ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పాశ్చత్య దేశాల ఆంక్షలు కూడా ఇరాన్ ఈ పరిస్థితికి దిగజారిపోవడానికి కారణం అయ్యాయి. 2015లో చూసుకుంటే ఒక డాలరు విలువ 32 వేల రియాల్స్‌గా ఉండేది. ఈ పదేళ్లలో 1.38 మిలియన్ రియాల్స్‌కు చేరిందంటే అక్కడి పరిస్థితులు ఎంత దారుణంగా పడిపోయాయో అర్థం చేసుకోవచ్చు. ఇరాన్‌లో ఒక సగటు ఉద్యోగి నెలకు 100 డాలర్లు (దాదాపు రూ.9 వేలు) మాత్రమే సంపాదిస్తారు. ఈ డబ్బులు కేవలం నిత్యావసర సరకుల కొనుగోలుకు, ఆహారానికే సరిపోతాయి. ఇరాన్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. మరోవైపు దాని చమురుపై ఆంక్షల కారణంగా ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం 2026 బడ్జెట్‌లో పన్నును 62 శాతానికి పెంచేసింది. ద్రవ్యోల్బణాన్ని కూడా 50 శాతం అంచనా వేసింది. ఇలా చేయడం ప్రజలను దోచుకోవడమేనని విమర్శలు వస్తున్నాయి. ఆర్థిక సంక్షోభంతో ప్రజలు ఇన్నాళ్లు దాచుకున్న డబ్బులు అవలీలగా ఖర్చయిపోతున్నాయి. ప్రస్తుతం ఆహారం, ఔషధాలు కొనలేని పరిస్థితులు వచ్చాయి. మరోవైపు తాగునీరు, విద్యుత్ సరఫరాల్లో కూడా తరచుగా అంతరాయాలు జరుగుతున్నాయి. పేదలకే కాకుండా పట్టణాల్లో ఉండే మధ్య తరగతి ప్రజలు కూడా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇరాన్ ప్రభుత్వం కూడా ఆందోళనకారులతో చర్చలు జరుపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలాఉండగా 2025లో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరిగిన యుద్ధం కూడా ఇరాన్‌కు భారీ దెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్ రక్షణ వ్యవస్థ, అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి లాంటి వారు ఖమేనీ ఇక ఉనికిలో ఉండకూడదని బహిరంగంగా వ్యాఖ్యానించడం సంచలనం రేపింది. మరోవైపు ఖమేనీకి ప్రస్తుతం 86 ఏళ్లు. ఆయన అనారోగ్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రజా క్షేమం కోసం ముందడుగు వేసిన సర్పంచ్



**మణుగూరు, విశాలభారతి:** ఎన్నికల ముందు నాయకులు ఎన్నో మాయ మాటలు చెప్తూ గెలిచాక ప్రజలను మరచి తమ హంగు ఆర్భాటాల కోసం ఎన్నెన్నో మార్గాలను ఎంచుకుంటారు. ఏమి అడిగినా మా పై అధికారి దృష్టికి తీసుకొని వెళ్తాము అని మాట మారుస్తూ కాలం వెళ్ళదీస్తారు. కానీ అందుకు బిన్నంగా ఈ చర్పంచ్ ప్రజల క్షేమం కోసం ఒక అడుగు ముందుకు వేశాడు. ఆయనే లంక మల్లారం చర్పంచ్ పూనెం రమేష్ మండలంలోని లంకమల్లారం గ్రామ పంచాయితీలో ప్రజల ఆరోగ్య దృష్ట్యా వ్యాయామం కోసం, పిల్లలకు ఆట స్థలం కోసం, పంచాయితీ సమావేశాలకు, పల్లె పరిశుభ్రత చేస్తూ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో చెత్తా చెదారంను డోజర్ ట్రాక్టర్ తో లంక మల్లారం పంచాయితీ సర్పంచ్ పూనెం రమేష్ తన సొంత ఖర్చులతో పరిశుభ్రంగా చేయించారు. అనంతరం పంచాయితీ లోని నూతనంగా మొక్కల పెంపకాన్ని ఏర్పాటు చేస్తూ పల్లెలకు ప్రకృతే అందం అని భావించి, ప్రకృతి వనం కోసం, జనం క్షేమం కోసం, స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించేందుకు నర్సరీ ని ప్రారంభించారు. పంచాయితీ కార్యాలయంకు చేరువలోవున్న రహదారి అద్వనంగా ఉండి రాకపోకలకు అధికారులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్న సందర్భాన్ని గమనించిన సర్పంచ్ పూనెం రమేష్ వెంటనే స్పందించి గ్రావెల్ రోడ్డు పోయించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వెంటవెంటనే పనులు చేయడంపట్ల ప్రజలు ఎంతగానో ప్రోత్సాహిస్తూ ముందు ముందు రోజుల్లో కూడా ఇలానే మరెన్నో సమస్యలు పరిష్కారం చేస్తూ తిరుగులేని నాయకుడిగా, ప్రజా సేవకుడిగా నిలవాలని ఆకాంక్షిస్తూ, ప్రజల ప్రశంసలు పొందుతున్నారు. ఆయన పలు కార్యక్రమాల్లో ప్రజల మనసులో తనదైన ముద్ర వేసుకుంటూ సుస్థిర స్థానం సంపాదించుకుంటున్నారు.

## బ్యాటరీ దొంగల బెడద.. రైతులు ఆందోళన



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం మన్పహాడ్ గ్రామంలో తీగల నాగార్జున, దానం బుచ్చమయ్య, దూదిమెట్ల సోమలింగం రైతుల ట్రాక్టర్ల బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించడం జరిగింది. ఈ గ్రామంతో పాటు ఇంతకుముందు మండలంలోని అనేక గ్రామాలలో రైతులను ఇబ్బంది పెడుతున్న బ్యాటరీ, మరియు డీజిల్ దొంగల ఆగడాలు గత కొద్ది నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. రైతులు ట్రాక్టర్లతో పొలాలను దున్ని పనులు పూర్తి అయ్యాక రాత్రి సమయంలో టాక్టర్ను పొలాల లోనే వదిలి వెళుతుండగా, అదే అవకాశంగా భావించిన దొంగలు డాక్టర్ బ్యాటరీలను డీజిల్ చోరీ చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. ఈ తరహా ఘటనల వల్ల రైతులకు భారీ ఆర్థిక నష్టం కలగడంతో పాటు మరుసటి రోజు వ్యవసాయ పనులు నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇలాంటి చోరీలు మరింత భారంగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. కావున సంబంధిత అధికారులు పోలీస్ శాఖ వెంటనే స్పందించి రాత్రి గస్తీ పెంచడం అనుమానితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా బ్యాటరీ దొంగల బెడదను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే ఈ పనులకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పల్లెను మరిచిన ఆర్టీసీ బస్సు



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఉచిత బస్సు పథకంలో కూడా నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రం ఆయనచో పల్లెలు మరిచిన ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలో చిట్యాల బాలంపల్లి కొత్త నందికొండ ఉల్సాయపాలెం మొలకచేర్ల బంగారికుంట తండా మొదలవు 13 గ్రామ పంచాయతీలు ఉన్నచో మండల కేంద్రానికి ఒక్కటే బస్సు రావటం అనేది బాధాకరం అడవిదేవులపల్లి మండలం కేంద్రం వరకు బస్సుల సంఖ్యను పెంచాలని అడవిదేవులపల్లి గ్రామ వాసులు అల్లాని కోటయ్య మరియు దూత తండా గ్రామ వాస్తవ్యులు కుర్ర శివ నాయక్ తదితరులు మండల కేంద్రానికి బస్సుల సంఖ్య పెంచాలని ఈరోజు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో డిఎం వినతి పత్రం అందజేయడం జరిగినది.

## బియ్యం అందజేసిన సుర్వి నరసింహ గౌడ్



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలో ఉన్న తాళ్లసింగారం గ్రామంలో ఇటీవల మరణించిన వారు మందారి లక్ష్మమ్మ వారి కుటుంబానికి మాజీ సర్పంచ్ మరియు చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ 100 కేజీల బియ్యం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కృష్ణ,ప్రధాన కార్యదర్శి మట్టపల్లి శ్రీశైలం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సరిపల్లి మారయ్య,దొనకొండ పాపయ్య,సుక్క నరసింహ,దొనకొండ చింటూ పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ కుందురు రఘువీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**అడవిదేవులపల్లి, విశాలభారతి:** అడవిదేవులపల్లి మండల కేంద్రంలో సర్పంచ్ కూరాకుల చిన్న రామయ్య ఆధ్వర్యంలో నల్గొండ ఎంపీ కుందురు రఘువీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా కేక్ కటింగ్ చేయడం జరిగినది అనంతరం సర్పంచ్ చిన్న రామయ్య మాట్లాడుతూ ఎంపీ రఘువీర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గోపగాని హనుమంతు గ్రామ ఏడవ వార్డు నెంబర్ మేడిపల్లి వెంకటేశ్వర్లు గొడుగు హనుమయ్య అల్లాని కోటయ్య ఉల్లెందుల వెంకన్న గాలి శ్రీనివాస్ గాలి వెంకటేశ్వర్లు తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

# కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన సర్పంచ్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రంలోని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్. పాఠశాలలో అటెండెన్స్ రిజిస్టర్ ను,బాలికలకు అందించే ఆహార మెనూను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలపై ప్రిన్సిపాల్ సుకన్యతో ఆరా తీశారు.కస్తూరిభా గాంధీ విద్యాలయం అంటేనే పేద పిల్లలకు ఒక నిలయమని,ఈ విద్యాలయం పిల్లలకు ఒక దేవాలయమని,ఇంతకు ముందు ఒక లెక్క ఇప్పుడు ఒక లెక్కని,పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లల ఆహార విషయంలో నిర్లక్ష్యం తగదని, మీకు ఎలాంటి సమస్యలున్నా నాకు తెలపాలని, నా వంతు సహకారం ఈ పాఠశాలకు అందిస్తానని,పిల్లలను తీర్చిదిద్దడంలో మీరందరూ భాగస్వాములు కావాలని టీచర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, తోటకూరి రమేష్,మండల కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల అనిల్ కుమార్,నాయకులు పత్తేపురపు శేఖర్, తదితరులున్నారు.

# కారోబార్ వెంకట్ రెడ్డికి పరామర్శ



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రానికి చెందిన కారోబార్ వెంకట్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వెంకటరెడ్డిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన బీఆర్ఎస్ మండల నాయకుడు ఏల సుందర్. వారి వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,బిఆర్ఎస్ నాయకులు కారుపోతుల బిక్షపతి, గోలి ఉప్పల్ రెడ్డి, నర్ర సోమశేఖర్, చింత యాదగిరి, రెడ్డిరాజుల అబ్బసాయిలు, చింత మల్లయ్య,కారుపోతుల యాదగిరి గొడిషాల మల్లేష్, పల్సం నరసింహులు, కారుపోతుల సందీప్, ఉప్పుల సామ్రాట్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక తరలింపు పై సర్పంచ్ ధర్నా

- సర్పంచ్ ఇది కృష్ణమూర్తి గౌడ్



**దేవర్పుల, విశాలభారతి:** మా వాగు నుండి ఇతర మండలాలకు ఇసుక తరలింపు అధికారులు పర్మిషన్లు ఇవ్వడాన్ని నిరసిస్తూ, దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. మా గ్రామం నుండి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని వెంటనే ఇసుక ట్రాక్టర్లకు ఇచ్చిన పర్మిషన్లను రద్దు చేయాలని, డిమాండ్ చేస్తూ సర్పంచ్ తో పాటు ఆయన వర్గీయులు, రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో అశ్వక్ అహ్మద్ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక ట్రాక్టర్లకు పర్మిషన్ ఇచ్చామని, తెలిపారు. ఈ విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ తో మాట్లాడాలని సూచించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై సృజన్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. కార్యాలయానికి అడ్డుగా ఉండొద్దని ధర్నాలు విరమించాలని, ఆందోళనకారులకు సూచించారు. అయితే పర్మిషన్లు పూర్తిగా రద్దు చేసి ఇసుక ట్రాక్టర్లను వాగులోకి రాకుండా చేసే వరకు అక్కడ నుండి కదిలేది లేదని సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ భీష్మించుకొని ధర్నా కొనసాగించారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సన్నాహక సమావేశం



**నిజామాబాద్, విశాలభారతి:** 2025 ..26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల లో భాగంగా ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి రెండవ తేదీ నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపూడి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ని గురుకుల కళాశాలలలో ఈ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా కళాశాలలకు విడతల వారీగా ఫిబ్రవరి 2వ తేదీ నుండి ఫిబ్రవరి 21వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలియజేశారు .ఆర్టీసీ అధికారులు విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు సమయానికి హాజరయ్యే విధంగా ఉదయం ఎనిమిదిన్నర వరకే సెంటర్లకు చేరే విధంగా బస్సులను నడపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యుత్ అధికారులు కూడా పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి కోరారు. ఈ సమావేశంలో సీనియర్ ప్రిన్సిపాల్ కాలిక్ పాషా, శ్రీనాథ్, రాజీయుద్దీన్ అస్లాం, విద్యుత్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# రామగుండం నగర పాలక సంస్థ లో స్పెషల్ డ్రైవ్



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో పట్టణ నగరంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు 2 . 3 , 25, 26, 27 డివిజన్ లలో ఈ స్పెషల డ్రైవ్ నిర్వహించారు. అక్బర్ నగర్ , ముబారక్ నగర్ , శాలపల్లి , కృష్ణా నగర్ , న్యూ పోరట పల్లి , మల్కాపూర రోడ్డు , శ్రీ నగర్ కాలనీ రాజీవ్ రహదారి తదితర ప్రాంతాల్లో సామూహికంగా ఊడ్చే కార్యక్రమం తో పాటు రోడ్ల ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , తుప్పలను జె సి బి , బ్లేడ్ ట్రాక్టర్ల తో తొలగించారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ట్రాక్టర్ లతో తరలించారు. మురుగు నీటి కాలువల్లో పూడిక తొలగించారు. అనంతరం రామగుండం రైల్వే ఓవర్ బ్రిడ్జ్ , అండర్ బ్రిడ్జ్ రోడ్లపై పేరుకుపోయిన ద తొలగించి శుభ్రపరిచారు.పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ ( స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి క్షేత్ర స్థాయిలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం , సంపత్ , ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎకో వారియర్స్ ప్రతినిధి మహేందర్ , మెప్మా సి ఓ లు ఊర్మిళ , శ్వేత , జవాన్లు సోమేష్ , ముదాం తిరుపతి , ఉమా మహేశ్వర్ , బండారి రవి , అశోక్ , సుగుణాకర్ , యూసఫ్ , సారయ్య , సంపత్ , దయానంద్ , ఆర్ పి లు పాల్గొన్నారు.

# అడ్డగూడూరులో డ్రైడే ఫ్రైడే



**విశాల భారతి, అడ్డగూడూర్:** మండలం కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి , డ్రైనేజీలో ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ వేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు పంచాయతీ కార్యదర్శి నరేష్, హెల్త్ సూపర్వైజర్లు,ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు,గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు బోల్తా

- బస్సులో సుమారు 50 మంది విద్యార్థులు
- మొండికుంట సాయిబాబా టెంపుల్ సమీపంలో ఘటన
- గాయపడిన వారిని భద్రాచలం హాస్పిటల్ కు తరలింపు
- బస్సు ప్రమాదాన్ని పరిశీలించిన డిఎస్పి వంగా రవీందర్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి:** అప్పటివరకు ఆడుతూ పాడుతూ ఇండ్ల వద్ద గడిపారు. కళాశాలకు వెళ్లాలనే ఆత్రుతతో సిద్ధమయ్యారు. తమ పిల్లలను కాలేజీకి పంపాలన్న తపనతో తల్లిదండ్రులు తొలి కోడికూతాలతోనే మేల్కొని పిల్లల కోసం అల్పాహారాలు, భోజనాలను తయారుచేసి మధ్యాహ్నం సద్ది కట్టారు. తమ పిల్లలను కాలేజీ బస్సు ఎక్కించి క్షేమంగా వెళ్లిరమ్మని టాటా చెబుతూ సాగనంపారు. బస్సులో కూర్చున్న విద్యార్థులు తన తోటి స్నేహితులతో కేరింతలు కొడుతూ ఆనందంగా ప్రయాణాన్ని సాగిస్తున్నారు. అప్పటివరకు ఆనందంగా గడిపిన వారికి ఏం జరిగిందో తెలియదు రెప్పపాటులో బస్సు ప్రమాదానికి గురై విద్యార్థుల ఆర్తనాధాలతో ప్రమాద స్థలం దద్దరిల్లిపోయింది. ప్రమాద విషయం తెలిసి తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలో అయోమయ స్థితిలో ఆసుపత్రి వైపు పరుగులు తీశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ కెఎల్ఆర్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన బస్సు రోజు మాదిరిగానే మణుగూరు నుండి సుమారు 40 మంది విద్యార్థులను ఎక్కించుకొని పాల్వంచ కళాశాలకు బయలుదేరింది. అశ్వాపురం మండలంలోని మొండికుంట సమీపంలో గల సాయిబాబా గుడి సమీపం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో మణుగూరు కు చెందిన స్వర్ణాంబిక అనే విద్యార్థికి తీవ్రమైన గాయాలు కాగా తురక భవాని, నిమ్మగోట స్పందన, మానస, దివ్యకి ఓ మాదిరి గాయాలు అయ్యాయి. మరికొందరరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. కళాశాల బస్సు ప్రమాదానికి గురైందన్న ఆవిషయం తెలిసిన వెంటనే మణుగూరు డిఎస్పి వంగా రవీందర్ రెడ్డి, అశ్వాపురం సిఐ జి అశోక్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ యాట శీను తో పాటు కొందరు స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను 108 వాహనం ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**తప్పిన పెను ప్రమాదం ఊపిరి పీల్చుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు..**

మణుగూరు నుండి ఇంజనీరింగ్ విద్యార్థులతో పాల్వంచ కళాశాలకు వెళుతున్న కేఎల్ఆర్ ఇంజనీరింగ్ బస్సు పల్టీ కొట్టిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులందరికీ స్వల్ప గాయాలతో బయటపడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసుల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మణుగూరు డిఎస్పి బస్సు ప్రమాదం జరిగిన చోటికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలేంటన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పాల్వంచలో సోలార్ షోరూమ్ ప్రారంభం



**పాల్వంచ, విశాలభారతి:** జిల్లా ప్రజలు విద్యుత్ ఖర్చును ఆదా చేసుకునే దిశగా ఇంటి పైకప్పుపై సోలార్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వారి కోసం పాల్వంచ కేంద్రంగా మహదేవ్ ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో సోలార్ షోరూమ్ను ఏర్పాటు చేశారు.శుక్రవారం ఈ షోరూమ్ను ఘనంగా స్థానిక అధికారులు,ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ యోజన కింద ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ పథకం ద్వారా నెలనెలా వచ్చే విద్యుత్ బిల్లులను జీరో స్థాయికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం 78 వేల రూపాయల వరకు సబ్సిడీని అందుబాటులోకి తెచ్చిందని నిర్వాహకులు నరేష్ పేటేటి వివరించారు.షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా లక్కీ డ్రా స్కీమ్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కేవలం 999 రూపాయలతో జాయిన్ అయితే జూన్ 2వ తేదీన జరిగే లక్కీ డ్రాలో మొదటి బహుమతి టాటా కారు, రెండో బహుమతి 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్ సెట్, మూడో బహుమతి ఎలక్ట్రిక్ స్కూటర్, నాలుగో బహుమతి ఎలక్ట్రిక్ సైకిల్, ఐదో బహుమతి వాటర్ ప్యూరిఫైయర్, అలాగే 20 మందికి కన్సోలేషన్ బహుమతులుగా వాటర్ జూసర్లు అందజేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా 5 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ను బుక్ చేసుకున్న మొదటి 100 మందికి ఉచితంగా స్మార్ట్ సెమీ ఆటో కట్ ఆఫ్ / సీలింగ్ హ్యాండ్ అందజేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్యానెల్స్, సోలార్ పవర్ ఫెన్సింగ్, సోలార్ పవర్ పంప్ సెట్లు తమ ప్రత్యేకత అని పేర్కొన్నారు.మరింత సమాచారం కోసం 99593 19282, 97053 65111 నంబర్లను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పేటేటి నరసింహారావు, రామలక్ష్మి, పేటేటి నరేష్, కంబంపాటి సిరీష, కాసిన శ్రీను, తాటికొండ రామకృష్ణ, బొమ్మ కిరణ్, సంకటి శ్రీను, చిన్న శ్రీను, గుంటి అశోక్, ముల్లంగి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# ఉపాధి హామీ పథకంలో పని రోజులు పెంచాలి



- పట్టణ ప్రజలకు ఈ పథకాన్ని వర్తింప చేయాలి
- బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ టౌన్ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సదరు సంఘం నాయకులు ధర్నా చేపట్టి అనంతరం సబ్ కలెక్టర్ వికాస్ మహాతో కు డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంగం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ ఈ పథకానికి పేరు మార్చడం సరైంది కాదని, కార్మికుల సంక్షేమం ధ్యేయంగా కొనసాగుతున్న ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. 2005లో ప్రారంభించిన ఈ పథకాన్ని యధావిధిగా 90% కేంద్ర ప్రభుత్వం నిధులు 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులతో కొనసాగించాలని అన్నారు. ఈ పథకం ద్వారా కూలీలకు న్యాయం జరిగే విధంగా రోజుకు 600 రూపాయల కూలీ డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని, పని రోజులు పెంచాలని, బోధన్ లాంటి పట్టణంలో అధిక సంఖ్యలో కూలి పనులకు వెళ్లేవారు ఉన్నారని ఈ పథకాన్ని బోధన్ పట్టణానికి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల గంగాధర్ తో పాటు బోధన్ డివిజన్ నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, కాశ రవి, శ్రీపతి మల్లేష్, భూపాల్, గోపాల్, కొండ్ర హనుమంతు, కె. సుదర్శన్, హెచ్. నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# శబరిమల యాత్రకు బయలుదేరిన గురుస్వామి శిష్య బృందం



**కూకట్ పల్లి, విశాలభారతి:** బాలనగర్ హెచ్ ఏ ఎల్ లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధల నడుమ శబరిమల అయ్యప్ప స్వామి యాత్ర ఘనంగా ప్రారంభమైంది. 46 రోజుల కఠిన దీక్షను నియమ నిష్ఠలతో పూర్తి చేసిన ఆర్. కే. రాజు గురుస్వామి శిష్య బృందం పవిత్రమైన ఇరుముడి కట్టుకుని శబరిమల మహా యాత్రకు బయలుదేరింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి మాలధారణ కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. మురళీధరన్ గురుస్వామి, రమణ గురుస్వామి, బాబు గురుస్వామి సహా పలువురు గురుస్వాములు యాత్రలో పాల్గొని స్వాములకు ఆశీర్వచనాలు అందించారు. మొత్తం 200 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, 21 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి ధరించి శబరిమల యాత్రకు సిద్ధమయ్యారు.స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో దేవాలయ ప్రాంగణం మార్మోగగా భక్తులంతా శాంతి, ఐక్యత,ఆధ్యాత్మిక వాతావరణంలో యాత్రకు సాగనంపారు. ఈ కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపిందని స్థానికులు తెలిపారు.

# ఇద్దరు జర్నలిస్టులపై కేసు నమోదు, అరెస్ట్

- రూ 6000 డిమాండ్, 5200 వసూలు
- బెదిరింపులకు పాల్పడిన నిందితులు
- చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమే
- బెదిరింపులు ఉపేక్షించేదిందని హెచ్చరిక
- బోత్ సిఐ డి గురుస్వామి




**విశాలభారతి, బోత్:** బోత్ పట్టణంలో గత నెల 25వ తారీఖున గేమింగ్ యాక్ట్ లో పట్టుబడ్డ నిందితుల వివరాలు వార్తాపత్రికలలో రాకుండా ఉండటానికి బాధితుని వద్ద ఆరువేల రూపాయలను డిమాండ్ చేసి 5200 వసూలు చేసి మిగిలిన వాటికై బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడం జరిగిందని బోథ్ సిఐ డి గురుస్వామి తెలిపారు. బాధితుడు షేక్ అలీ ఫిర్యాదు మేరకు బోత్ పోలీస్ స్టేషన్ నందు sec 308 (5) r/w 3(5) తో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని ఎవరైనా బెదిరింపులకు ఎక్స్ట్రాషన్కు బ్లాక్ మెయిలింగ్ పాల్పడితే అధికార దుర్వినియోగియానికి పాల్పడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోత్ ఎస్సై శ్రీ సాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగిరెడ్డి కృష్ణారెడ్డికి నివాళులు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** జిహెచ్ఎంసి నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డి,తండ్రి సింగిరెడ్డి కృష్ణారెడ్డి పరమపదించడంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి అంత్యక్రియలో పాల్గొని పూలమాలలతో నివాళులు అర్పించారు.ఈ అంత్యక్రియల్లో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, హయత్ నగర్ రైతు సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీరాములు, యువజన కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి కొండల్ గౌడ్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కవితమ్మను కలిసిన జాగృతి నేతలు




**రంగారెడ్డి, విశాలభారతి:** తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను రంగారెడ్డి, కామారెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి,ఎదురుగట్ల సంపత్ గౌడ్, రామిడి వెంకట్ రెడ్డిలు శుక్రవారం హైదరాబాదులోని కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమెకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జిల్లాలో భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలు, సంస్థాగతంగా బలోపేతం గురించి కవిత దిశానిర్దేశం చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు బాబురావు,సీమల రమేశ్, చదలవాడ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర శుభాకాంక్షలు

- పెద్ద అంబర్పేట్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఈదమ్మల బలరాం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** నూతన సంవత్సరం సందర్భంగా ఇబ్రహీంపట్నం మాజీ శాసనసభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఈదమ్మల బలరాం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ బలరాం మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు తెలిపారు.ఈ కార్యక్రమం లో కుంట్లూరు మాజీ సర్పంచ్ కళ్లెం ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు జోర్క రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర సందర్భంగా సీఎంకి శుభాకాంక్షలు




**సికింద్రాబాద్, విశాలభారతి:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని, అలాగే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా నిర్మించేందుకు క్షేత్రస్థాయిలో పార్టీని బలపరిచే దిశగా నిరంతరం పనిచేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా బాధ్యతగా కృషి చేస్తానని సీఎంకి, టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజల సమస్యల పరిష్కారంపై ముఖ్య నేతలతో సానుకూలంగా చర్చ జరగడం ఈ సమావేశం ప్రత్యేకతగా నిలిచింది.

# నీటి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**మర్పల్లి, విశాలభారతి:** వికారాబాద్ జిల్లా మర్పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ దగ్గర లో నీటి కాలువ లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. శుక్రవారం మర్పల్లి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పనులు చేస్తున్న కూలీలకు నీటి కాలువలో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడడం గమనించిన కొందరు కూలీలు, రైల్వే సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ట్రైన్ లో బిక్షాటన చేసే వ్యక్తి చనిపోయి ఉండవచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.సమాచారం అందుకున్న మర్పల్లి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని తాళ్ల సహాయంతో బయటికి తీసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మూడు నుంచి నాలుగు రోజులు క్రితం నీటిలో పడి ఆ వ్యక్తి చనిపోయి ఉండవచ్చని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మర్పల్లి ఎస్సై అబ్దుల్ రావుఫ్ తెలిపారు.

# 5 డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

- కార్యక్రమంలో పాల్గొన్న డిసి శైలజ



**మేడిపల్లి, విశాలభారతి:** బోడుప్పల్ సర్కిల్ లో జి. ఎచ్. ఎమ్. సి. డిప్యూటీ కమిషనర్ శైలజ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం లో భాగముగా 5 వ రోజు పీర్జాదిగూడ ,మేడిపల్లి, బోడుప్పల్, చెంగిచెర్ల వార్డ్లలో అన్ని ఫుట్ పాత్ పార్క్ల ముందు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో డి.ఇ.ఇ (ఎస్. డబ్ల్యూ.ఎమ్.) కె. జాహ్నవి శశాంక్, ఎ. ఇ. మహేష్ (ఎస్. డబ్ల్యూ. ఎమ్) డి. మహేష్ గారు, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సంగీత, ఎన్విరన్మెంటల్ ఇంజనీర్స్ నిఖిల్,మురళి, వార్డ్ ఆఫీసర్స్, జవాన్లు,సిబ్బంది పాల్గొన్నారు.

# సాగర్ ఎంక్లేవ్ కాలనీలో సమస్యలను పరిష్కరిస్థా

- జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్
- హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్



**ఎల్బీనగర్, విశాలభారతి:** సాగర్ ఎంక్లేవ్ కాలనీలో సమస్యలను పరిష్కరించనున్నట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ సుజాత నాయక్ కాలనీలో పర్యటించారు.సందర్భంగా కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పార్కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరగా స్పందించిన కార్పొరేటర్ సి సి రోడ్డు నిర్మాణ తో పాటు పార్కు అభివృద్ధి చేస్తానని తెలిపారు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యం చారి,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మూడవత్ రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, జనార్ధన్ ,మనోహరాచారి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


# సర్పంచ్‌లుగా ఎన్నికైన అక్క,తమ్ముడు



**కేశంపేట,విశాలభారతి:** కేశంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులతో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శుక్రవారం పరిచయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. ఈ సమావేశ కార్యక్రమంలో ఒక అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. సర్పంచులుగా గెలుపొందిన అక్క, తమ్ముళ్లు ఈపరిచయ సమావేశానికి హాజరయ్యారు. అక్క తమ్ముళ్లైన తొమ్మిది రేకుల గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన బీస కవితా కరుణాకర్ రెడ్డి, మంగళి గూడ గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన కొట్టం నరేందర్ రెడ్డి మండలంలో జరిగిన తొలి సమావేశానికి హాజరు కావడం విశేషం.

# రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్‌కు ఎంపికైన బాటసింగారం విద్యార్థిని

- అభినందించిన ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్






**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** అబ్దుల్లాపూర్ మెట్ మండలం పరిధిలోని బాటసింగారం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆర్. వైష్ణవి రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు, 18 సంవత్సరాల లోపు బాలికల విభాగంలో 4 కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొనడానికి ఆర్. వైష్ణవి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఈ పోటీలు ఈ నెల 2వ తేదీ నుండి 3వ తేదీ వరకు, హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ప్రధాన అథ్లెటిక్స్ స్టేడియంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ..డాక్టర్ సోలపోగుల స్వాములు శిక్షణలో మా పాఠశాల విద్యార్థులు పలు మార్లు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికవడం ఎంతో ఆనందకరం. ఇది పాఠశాలకే కాకుండా, మండలానికీ గర్వకారణం. క్రీడా రంగంలో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు ప్రశంసనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, గ్రామ ప్రజలు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు, క్రీడాభిమానులు విద్యార్థిని హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.

# అయ్యప్ప సన్నిధానానికి రూ.25 వేల విలువైన పడి అందజేత

- మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ బాచారం గ్రామంలోని జ్ఞానగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పరిధిలో ఉన్న అయ్యప్ప సన్నిధానానికి రూ.25,000 విలువైన అయ్యప్ప స్వామి పడిని భక్తి భావంతో అందజేశారు.ఈ సందర్భంగా సన్నిధానం నిర్వాహకులు మాట్లాడుతూ..భక్తి శ్రద్ధలతో ఆలయ అభివృద్ధికి తోడ్పడిన గ్యారల శ్రీనివాస్ గౌడ్ కి తమతో పాటు స్వాములందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది భక్తులకు ప్రేరణగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే



**విశాలభారతి, గోదావరిఖని:** రాబోవు మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో రామగుండం కార్పోరేషన్ పై గులాబీ జెండా ఎగురాలని, గులాబీ సైనికులు గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుకోరుకంటి చందర దిశానిర్దేశం చేశారు. శుక్రవారం 8 కాలనిలో బీ.ఆర్.ఎస్ పార్టీ సమావేశం లో ఆయన మాట్లాడుతూ.త్వరలో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.నాడు జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను తొలి సీఎం కేసీఆర్ పట్టుబట్టి కారుణ్య నియామకం ద్వారా మళ్లీ అమలు చేయించి సింగరేణి సంస్థకు పురుడు పోశాడని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం కారుణ్య నియామకాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు.అమలు కానీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి విధ్వంస పాలనతో రెండేళ్లు గడిపిందని, ఈ రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.

రామగుండంలో ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి ఏమిటో చెప్పుకోలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. రామగుండం కార్పొరేషన్ కు త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీకి అనుకూలమైన ఓట్లను చీల్చేందుకు అధికారం అడ్డుపెట్టుకొని కుట్రలు చేస్తున్నారని, ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు కార్యకర్తలు బాధ్యత తీసుకొని ప్రజల్లోకి వెళ్లి వివరించాలని సూచించారు. ఈనెల 10వ తేదీన మరొకసారి సమావేశమై ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ముందుకు వెళ్లే విధానాలపై కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు.ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల పనిచేసి రామగుండం కార్పొరేషన్ లో గులాబీ జెండా ఎగిరేల కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 8 వ కాలనీ బీ.ఆర్.ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మేడి సదానందం అధ్యక్షతనా జరిగిన సమావేశంలో మాజీ కార్పొరేటర్లు మందల కిషన్ రెడ్డి, కొండ్ర స్టాలిన్ గౌడ్, బాదే అంజలి దేవి, నాయకులు పులి రాకేష్, గూడెల్లి రామచందర్, నారాయణదాసు మారుతి ముత్యాల గౌడ్, కుమార్ నాయక్, ముక్కెర మొగిలి, దాసరి రాజమౌళి, బాలరాజు, సుజాత, స్వరూప, రోజా, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్లాదాన్ని పంచే పార్కు అధ్వాన స్థితిలో

- ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న చింతపల్లి గూడ గ్రామస్థులు



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలోని చింతపల్లి గూడ పార్కు , ఓపెన్ జిమ్ అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని , అధికారులు కల్పించుకొని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఉక్కుల అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. శంషాబాద్ జోనల్, ఆదిబట్ల సర్కిల్ కొంగరకలాన్ డివిజన్ పరిధిలోని చింతపల్లిగూడ పార్క్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డా. ఉక్కుల అశోక్ మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఉన్న ఈ పార్క్ ప్రజలకు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో పాటు, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరమ్మతులు, నిర్వహణ పనులు చేయకపోవడంతో పార్క్ దయనీయ స్థితికి చేరిందని తెలిపారు. వెంటనే సంబంధిత శాఖలు స్పందించి పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్క్ పరిస్థితిపై స్థానికులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్, నాయకులు శేరి రమేష్, ఉడుతల రవి గౌడ్, జోగు మహేందర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎంపికనా.. ఎన్నికనా?

- సహకార సంఘాల ఎన్నికలపై జోరుగా ప్రచారం
- నామినేటెడ్ పదవుల కింద భర్తీ అంటూ సోషల్ మీడియాలో హల్చల్




**రంగారెడ్డి,విశాలభారతి:** రైతులు ఎన్నుకునే సహకార సంఘాల ఎన్నికలపై ప్రజల్లో జోరుగా చర్చ నడుస్తుంది. డిసెంబర్ 19 నుంచి సహకార సంఘాల పాలకవర్గం రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వీటి ఎన్నికలపై గ్రామాల్లో చర్చ జోరు అందుకుంది. పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో వీటికి ఎన్నికలు జరుగుతాయని, లేదు లేదు వ్యవసాయ మార్కెట్ పదవులను నామినేటెడ్ విధానంలో ఏ విధంగా భర్తీ చేస్తారో అలాగే సహకార సంఘాల కూడా ఎంపిక చేస్తారని ప్రచారం జోరుగా సాగుతుంది.మొత్తం మీద ఎన్నికలా లేక ఎంపిక చేస్తారా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.ఏడాది క్రితమే సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మొదట్లో ఆరు మాసాలపాటు పాలకవర్గాల పదవీకాలం పెంచారు. రెండవసారి కూడా పదవీకాలం పెంచారు. తాజాగా ఇటీవల పదవీకాలం పొడిగింపును ప్రభుత్వం రద్దు చేసి పాలకవర్గాల స్థానంలో స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. పాలకవర్గాల పదవీకాలం రద్దు చేసినందున ఎన్నికలు జరుగుతాయని కొంతమంది అదే స్థాయిలో ఎన్నికలు జరగవని నామినేట్ పదవుల మాదిరిగానే పాలకవర్గాలను ఎంపికచేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది.

**పథకాలే గెలిపిస్తాయనే నమ్మకంలో కాంగ్రెస్..**

ఒకవేళ సహకార సంఘాలకు ఎన్నికలు జరిగినా 2023లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని,తాము ప్రవేశ పెట్టిన పథకాలే గెలిపిస్తాయనే నమ్మకంలో కాంగ్రెస్ వుంది.ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో51 సహకార సంఘాలు వున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సంఖ్య పెంచాలని నిర్ణయించారని, అందులో భాగంగానే పది సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వీటికి ఆమోదముద్ర లభించాల్సి ఉంది.

# వివేకానంద స్కూల్ బస్సు బోల్తా



- మద్యం మత్తులో డ్రైవింగ్ అనుమానంగణేష్‌పాడు వద్ద బోల్తా
- గణేష్‌పాడు ఎన్ఎస్‌పి కాలువ సమీపంలో వివేకానంద స్కూల్ బస్సు బోల్తా
- సంఖ్యకు మించి విద్యార్థులు – డ్రైవర్ మద్యం సేవించట్టు అనుమానం
- గ్రామస్తుల సహాయం – గాయపడిన పిల్లలు వేంసూర్ ఆసుపత్రికి తరలింపు

**సత్యపల్లి, విశాలభారతి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మొద్దులగూడెం గ్రామంలో ఉన్న వివేకానంద స్కూలుకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదానికి గురైంది. స్కూల్‌కు చెందిన చిన్నారులను ఎక్కించుకుని వెళ్తున్న బస్సు గణేష్‌పాడు ఎన్ఎస్‌పి కాలువ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో అనుమతించిన సంఖ్యకు మించి విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి పిల్లలను బస్సులో ఎక్కించడంతో వాహనంపై అదుపు కోల్పోయినట్లు భావిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం బస్సు డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడిపిన కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. బాధ్యత వహించాల్సిన వ్యక్తి పరారీలో ఉండటం ఘటనపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనను గమనించిన గణేష్‌పాడు గ్రామస్తులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న చిన్నారులను ఒక్కొక్కరిని బయటకు తీసి ప్రాణాలతో కాపాడారు. గ్రామస్తుల సమయస్ఫూర్తి వల్లే పెద్ద ప్రమాదం, ప్రాణనష్టం తప్పినట్లు చెబుతున్నారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను తక్షణమే వేంసూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. ఎక్కువ మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా, కొంతమందిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బస్సును పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ మద్యం సేవించాడా, బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉందా, స్కూల్ యాజమాన్యం నిబంధనలు పాటించిందా అన్న అంశాలపై విచారణ జరుగుతోంది. ఈ ప్రమాదం స్కూల్ బస్సుల భద్రతపై మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్:** రోడ్డు భద్రత మాసోత్సవం 2026 సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నాగోల్ పరిధిలోని అల్కాపురి ఎక్స్ రోడ్డు వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ టి ఓ అమర్ నాథ్, ట్రాఫిక్ డిసిపి నవీన్ కుమార్ రెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐపి శివ నాగ ప్రసాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం,మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వేగ నియంత్రణ పాటించాలని, వాహనదారులకు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఐ అనిత, ఎం విష్ణుదీప్ ఎం.వి.ఐ, జే అభిలాష నాయక్ ఏ ఎం వి ఐ, అరుణ్ రాచపూడి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్పెక్టర్, బి శ్రీధర్ ఎం వి ఐ, డి వెంకటేశ్వర్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, కల్లూరి రవి ఆర్ ఎస్ ఐ, నర్సింగ్ రావు ఆర్ఎస్ఐ, ట్రాఫిక్ ఎస్ఐలు సురేష్ లాల్, ఆర్టిఏ నెంబర్ హైదరాబాద్ తో పాటు నాగోల్ పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా అయ్యప్ప ఇరుముడి మహా పడిపూజ



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో గంగాదేవి పెద్దమ్మ తల్లి సన్నిధాన అయ్యప్ప స్వాముల ఇరుముడి మహా పడిపూజ మహోత్సవం ఈదులకంటి గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో కన్నులపండుగగా నిర్వహించారు. ఈ మహా ఇరుముడి మహా పడిపూజ కార్యక్రమానికి సుమారు 1500 మంది అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణను ఉప్పరిగూడ మాజీ సర్పంచ్, బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా బూడిద రామ్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప మాలదారులు మండలకాలం పాటు ఏంతో నిష్ఠ నియమాలతో, భక్తి శ్రద్ధాలను పాటిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం, ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి, నల్ల రమేష్‌గౌడ్, భీమ అర్జున్, బూడిద చిన్న రాంరెడ్డి, వివేక్, శ్రవణ్, దొంద రమణ రెడ్డి, దొంద విష్ణువర్ధన్ రెడ్డి, గంగనామోని సత్యనారాయణ, అర్జున్, రావుల ప్రవీణ్, బాలం పవన్, మొలుగు శ్రీనివాస్, మొలుగు రవి తదితరులు పాల్గొన్నారు.

# పసిగందు ప్రాణం కోసం కన్న తల్లి త్యాగం

- తల్లి మృతి.. 28 రోజుల బిడ్డతో దిక్కుతోచని కుటుంబం
- సోషల్ మీడియా స్పందనతో రూ.50 వేల చేయూత
- కురవి ఎస్సై గండ్రాతి సతీష్ కూడా తన వంతు సహాయం అందజేత



**కురవి, విశాలభారతి:** అప్పుడే పుట్టిన పసిగందు ప్రాణం కోసం కన్న తల్లి ప్రాణం విడిచిన హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. బ్రాహ్మణపల్లి శివారు జిల్లెల్‌గూడెం గ్రామానికి చెందిన కల్తీ నగేష్ భార్య కల్తీ రజిత ఇటీవల బాబుకు జన్మనిచ్చిన అనంతరం బ్లడ్ ఇన్ఫెక్షన్‌కు గురై మృతి చెందారు. తల్లి లేకుండా 28 రోజుల పసిబిడ్డతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో మిగిలింది. ఈ దారుణ ఘటన తెలుసుకున్న కురవి పట్టణ కేంద్రానికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ గంగరబోయిన రఘు, బాధిత కుటుంబాన్ని కలుసుకుని వారి ఆర్థిక దుస్థితిని పరిశీలించారు. అనంతరం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆ కుటుంబ పరిస్థితిని వీడియో రూపంలో పోస్ట్ చేయగా, దానికి స్పందించిన పలువురు దాతలు చేయూతనందించారు. దాతల సహకారంతో సమకూరిన రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ కూడా తన వంతు సాయాన్ని జోడించి, బాధిత కుటుంబ సభ్యులకు వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మానవత్వాన్ని చాటిన గంగరబోయిన రఘు సేవలను గ్రామస్తులు ప్రశంసించారు.

# ఆర్డీఓకి నూతన సంవత్సర శుభాకాంక్షలు

- తెలిపిన నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్



**కోదాడ, విశాలభారతి**: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీఓని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఎప్పుడు ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరరీ సట్టు రాధిక, పులి శ్రీనివాస్, మట్టపల్లి మహేష్, గంటేపొంగు విక్రమ్, వెంకట్, నగేష్, ప్రసాద్, రఫీ, నల్లమల్ల సైదులు, వనపర్తి నాగరాజు, దుగ్యాల సతీష్, అరవింద్, దుద్దేల నాగార్జున, పెడిమర్తి సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా.. ఒకరు మృతి




**కోదాడ, విశాలభారతి:** మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన వ్యక్తి మేళ్లచెరువు పెట్రోల్ పంపు సమీపంలో ఆటో పల్టీ పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే పెంటే వెంకటమ్మ రోజువారి మాదిరిగానే శుక్రవారం కూడా మేళ్లచెరువు పరిసర ప్రాంతంలో టీజీ 29 టీ 4835 నెంబర్ గల ఆటోలో రోజువారి మాదిరిగానే కూలికి వెళుతుండగా మేళ్లచెరువు సమీపంలో గల పెట్రోల్ పంపు వద్ద ఆటో అదుపుతప్పి పల్టికి పడటంతో పెంటే వెంకటమ్మ అక్కడికక్కడే మృతిచెందగా పాలపాటి మంగమ్మ కాలు విరగడం జరిగింది. ఆటోలో 9 మంది జనాభా ఉన్నారు. మిగతా వారికి చిన్న చిన్న గాయాలు అయినాయి. ఫస్ట్ ఎయిడ్ నిమిత్తం వాళ్ళని మేళ్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.

## పేరూరు ఎస్సైకు శుభాకాంక్షలు తెలియజేసిన నూతన సర్పంచులు



**వాజేడు, విశాలభారతి:** మండల పరిధిలోని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ను చెరుకూరు సర్పంచ్ వాసం రాజబాబు,కృష్ణాపురం సర్పంచ్ విజయ్ కుమార్, ధర్మారం సర్పంచ్ కాక సుమతి,అయ్యవారిపేట ఉపసర్పంచ్ కాలేశ్వరపు సర్వేశ్వరరావు,టేకులగూడెం సర్పంచ్ బాలయ్య, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ ఆధ్వర్యంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా సర్పంచ్, ఉప సర్పంచ్ గా గెలిచిన ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయండి పోలీస్ శాఖ తరపున అన్ని సహాయ సహకారాలు ఉంటాయి మీరు కూడా పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని పెండ్లి పోలీసింగ్ నినాదాన్ని ముందుకు తీసుకువెళ్లాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో వాజేడు మండలం మాజీ జెడ్పిటిసి తల్లడి పుష్పలత, కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌరవ సర్వేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చెన్నం ఎల్లయ్య, ఎస్కే ఖాజావలి, నల్లగాసి రమేష్,దాట్ల సుధాకర్,గోద్దే సాయిబాబు, కాలేశ్వరపు సంతోష్, కురుసం కృష్ణమూర్తి ,ఆత్మకూరి ప్రవీణ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నం సర్పంచ్ ఉప సర్పంచ్ ఫోరం ఎన్నిక



**శంకరపట్నం, విశాలభారతి:** శంకరపట్నం మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండల నూతన సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షునిగా కె.చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా గొట్టే మధు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శంకరపట్నం మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు,ఉప సర్పంచ్ లు పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి జరుపుకోవాలని సూచించారు.భవిష్యత్తులో ఉన్నత పదవులు సాధించాలని కోరారు. సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులుగా అగ్గని శ్రీలత వడ్లకొండ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మారవేని రాజయ్య, కార్యదర్శిగా ఊకంటి మాధవి, కోశాధికారిగా కొంకటి రవి, గౌరవ సభ్యులుగా చింతి రెడ్డి పద్మ, దుర్గం సుజాత, బుల్లిండ్ల కమల, ఉప సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షుడిగా గీసిరి రణధీర్ రెడ్డి, కనకం నాగేశ్వరీ, ప్రధాన కార్యదర్శి దొంగల రమేష్, కార్యదర్శి దండు రాజేష్, కోశాధికారి శనిగరపు అంజి, సహాయ కార్యదర్శి ఎం.డి గౌస్, సభ్యులుగా చింతం రాజేశం, లింగంపల్లి కృష్ణారెడ్డి ఆడెపు సుధాకర్ లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కొత్తగట్టు ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, నియోజకవర్గ మహిళా నాయకురాలు కవ్వ పద్మ, గట్టు తిరుపతి గౌడ్, యూత్ నాయకుడు షారుఖ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాదవ్ 'జాదూ'.. విపక్షాలకు మైండ్ బ్లాక్!

- **ఫిరోజ్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**



**ఆదిలాబాద్, విశాలభారతి:** మున్సిపల్ గడ్డపై ఇప్పుడు పొలిటికల్ హీట్ మామూలుగా లేదు. రాత్రికి రాత్రి వెలువడిన ఓటర్ల ముసాయిదా జాబితా ఒక పక్క అధికారుల కసరత్తును చూపిస్తుంటే, మరోపక్క రాజకీయ దిగ్గజాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మహిళా ఓటర్ల 'మెజారిటీ' మ్యాజిక్ ఫిగర్‌ను దాటేయడం, యువత 'సోషల్ మీడియా' జోష్‌తో గ్రౌండ్ లెవల్‌లో సెగలు పుట్టిస్తుంటే, ప్రత్యర్థుల వ్యూహాలకు ఎక్కడికక్కడ బ్రేకులు పడుతున్నాయి. జిల్లా కాంగ్రెస్ సారధి డాక్టర్ నరేష్ జాదవ్ పంచాయతీల గెలుపు గుర్రాలతో మున్సిపల్ కోటపై కన్నేయగా, ఖిజర్ పాషా వంటి యువ కిశోరాల ఎంట్రీతో ముస్లిం మైనారిటీల ఓట్లు పాతకాపుల అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. రాజకీయ చదరంగంలో జాదవ్ 'జాదూ' ప్రత్యర్థుల మైండ్ బ్లాక్ చేయడం ఖాయం.

**గణాంకాల గారడీ: బల్దియా బాస్‌లు ఆడబిడ్డలే!**

ఆదిలాబాద్ మున్సిపల్ ఆఫీస్ గోడలపై అంటించిన ఓటరు లిస్టు చూస్తుంటే అరివీర భయంకరమైన నిజాలు బయటపడుతున్నాయి. పట్టణంలో పురుష పుంగవుల కంటే మహిళా ఓటర్లే 4,029 మంది ఎక్కువగా ఉండటం చూస్తుంటే, ఈసారి బల్దియా పీఠంపై ఎవరు కూర్చోవాలో నిర్ణయించేది 'అమ్మలగన్న అమ్మలే' అని స్పష్టమవుతోంది. మొత్తం 1,43,773 మంది ఓటర్లలో మహిళలు 73,898 మంది ఉండటం కాంగ్రెస్ పార్టీకి అతి పెద్ద సానుకూలాంశం. ముఖ్యంగా 16వ వార్డులో ఓటర్ల ప్రభంజనం కనిపిస్తుంటే, 26వ వార్డు మాత్రం సైలెంట్‌గా ఉంది. మార్పులు, చేర్పుల గందరగోళం మధ్య అధికారులు చేస్తున్న కసరత్తు, ఏ గల్లీలో ఏ ఓటు ఎటు మళ్లుతుందో అన్న టెన్షన్‌ను అభ్యర్థుల్లో పెంచుతోంది.

**'పంచాయతీ' స్కెచ్.. మున్సిపల్ టార్గెట్!**

ఇటీవల డాక్టర్ నరేష్ జాదవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పల్లెల్లో సృష్టించిన ప్రభంజనం ఒక ఎత్తైతే, ఇప్పుడు పట్టణంలో వేయబోయే అడుగు మరో ఎత్తు. పల్లెల్లో 'సర్పంచ్' గిరిని కాంగ్రెస్ జెండా కిందకు తెచ్చిన ఆయన, అదే జోష్‌తో మున్సిపల్ వార్డులపై గురి పెట్టారు. "ఓటు మనది గెలుపు మనది" అన్న నినాదంతో ఆయన వేస్తున్న పావులు చూస్తుంటే, ప్రత్యర్థులకు నిద్రలేని రాత్రులు మొదలయ్యాయి. పంచాయతీ ఎన్నికల గెలుపు కేవలం ట్రెయిలర్ మాత్రమేనని, అసలు సినిమా మున్సిపల్ పోలింగ్ రోజున చూపిస్తామని కాంగ్రెస్ శ్రేణులు రొమ్ము విరుస్తున్నాయి.

**మైనారిటీ యువత గర్జన!**

ఆదిలాబాద్ రాజకీయాల్లో మైనారిటీ ఓట్లు ఎప్పుడూ నిర్ణయాత్మకమే. అయితే ఈసారి సీన్ మారింది. కేవలం ఓటు వేయడమే కాదు, రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలనే కసితో మైనారిటీ యువత ఉంది. ముఖ్యంగా ఖిజర్ పాషా వంటి యువ నాయకత్వానికి పార్టీలో ప్రాధాన్యత పెరిగితే, అది మైనారిటీ వర్గాల్లో ఒక ఎలక్ట్రిక్ వైబ్రేషన్‌ను సృష్టిస్తుంది. ఖిజర్ పాషా వంటి డైనమిక్ లీడర్ల వెనుక నడుస్తున్న యువ సైన్యం, కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిస్తే బల్దియా కోటపై జెండా పాతడం ఖాయం. ఇది కేవలం ఓట్ల సమీకరణం కాదు, షెహర్‌ఎఆదిలాబాద్ గల్లీల్లో వినిపిస్తున్న ఒక కొత్త మార్పు గళం.

**సంపూర్ణ విజయానికి అడుగులు!**

ఎన్నికలు కేవలం గెలుపు కోసం కాదు, ఆదిలాబాద్ భవిష్యత్తు కోసం. ముసాయిదాలోని 1,43,773 మంది ఓటర్ల నాడిని పట్టుకోవడంలో కాంగ్రెస్ వేగంగా దూసుకుపోతోంది. సీనియర్ల అనుభవం, డాక్టర్ నరేష్ జాదవ్ వ్యూహం, ఖిజర్ వంటి యువ రక్తం, ఇల్లాలి దీవెనగా తోడైన మహిళా లోకం, ఈ నాలుగు శక్తులు ఏకమైతే కాంగ్రెస్ అఖండ విజయాన్ని అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు. పట్టణ వాసుల హృదయాలను గెలుచుకోవడంలో హస్తం పార్టీ చూపిస్తున్న చొరవ చూస్తుంటే, త్వరలోనే బల్దియా పీఠంపై కాంగ్రెస్ పట్టాభిషేకం ఖాయమనిపిస్తోంది.ః

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణంలోని లక్కారం కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తూ చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని 20 వార్డుల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,మాజీ ఎంపీపీ తాడూరు వెంకటరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,జిల్లా ఫిషరీస్ చైర్మన్ పాశం సంజయ్ బాబు,మండల అధ్యక్షులు బోయ దేవేందర్,తిరుపతి రవీందర్,బొంగు జంగయ్య గౌడ్,మొగుదల రమేష్ గౌడ్,బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్,కాసర్ల శ్రీనివాసరెడ్డి కొయ్యల సైదులు,బాబా షరీఫ్,హన్ను భాయ్,బొబ్బిళ్ళ మురళి,చేన్నగోని అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి



**తిరుమలగిరి, విశాలభారతి :** జనవరి 18వ తేదీన ఖమ్మంలో సిపిఐ పార్టీ శతజయిని ఉత్సవాల సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలం మావిడాల గ్రామం x రోడ్ లో జరిగిన తిరుమలగిరి, తుంగతుర్తి మండల సమితి సమావేశం తిరుమలగిరి , తుంగతుర్తి మండలం కార్యదర్శిలు ఎస్డీ ఫయాజ్, పాల్వాయి పున్నయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ అడుగు అడుగున నిర్బంధాలతో, ప్రతినిత్యం శత్రువుల దాడుల మధ్యన జరిగిన పోరాటాల విజయాలు 100 సంవత్సరాల భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్ర 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీగా స్థాపించబడిందని నాటినుండి నేటి వరకు అనేక నిర్బంధాలను ఎదుర్కొని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు భూస్వాముల గడిలను బద్దలు కొట్టడంలో భారత కమ్యూనిస్టు పార్టీది ముఖ్య పాత్ర వహించింది అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంది సిపిఐ పార్టీ అని అన్నారు. ప్రజాస్వామిక హక్కుల కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. నేడు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం 100 సంవత్సరాలుగా కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని హక్కును ఒక కలం పోటుతో నాలుగు లేబర్ కోడ్లుగా విభజించిందని అన్నారు. అదేవిధంగా పేద ప్రజలకు అంతో ఇంతో ఉపాధి లభిస్తున్నటువంటి ఉపాధి హామీ చట్టాన్ని కూడా రద్దుచేసి కేవలం ఒక పథకంగా రూపొందించి పేద ప్రజలకు పని దొరక్కుండా చేస్తుందని అన్నారు. అందుకే ఈ ప్రభుత్వాలు అవలంబిస్తున్న దుర్మార్గా దివాలకోరు విధానాలపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తుందని, ఆ పోరాటాలలో ప్రజలు భాగస్వామ్యమై విజయం సాధించుకోవడం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. *ఈ సందర్భంగా సిపిఐ పార్టీలోకి కోక్యతాండ నుంచి 15 కుటుంబాలు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సమక్షంలో చేరినారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఎల్లంల యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజర్ కార్యదర్శి గుగులోతు రాజారాం, ఎస్ కే ఏక్ బాల్, త్రిపురాల శ్రీకాంత్, జంపాల మల్లయ్య, ఇస్లావత్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## కాలం చెల్లిన బస్సు వల్లే ప్రమాదాలు



- **యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి పై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి**
- **మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**

**అశ్వాపురం, విశాలభారతి:** మణుగూరు నుండి పాల్వంచకు వెళుతున్న కె ఎల్ ఆర్ కాలేజీ బస్సు మొండికుంట వద్ద కల్వర్టుపై నుండి దూసుకు వెళ్లి ప్రమాదం జరిగిన ఘటనలో మణుగూరు, అశ్వాపురం మండలాలకు సంబంధించిన విద్యార్థులకు తీవ్రగాయాలు అవడం బాధించదగ్గ విషయమని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం ఉదయం అశ్వారావుపేట నియోజకవర్గ పర్యటనకు వెళుతున్న తన వాహనం కంటే ఒక 5 నిమిషాల ముందు వెళుతున్న కళాశాల బస్సుకు ప్రమాదం జరిగిందన్నారు. తక్షణమే 108 అంబులెన్స్ కు సమాచారాన్ని అందించి.. హుటాహుటిన గాయాలైన పిల్లలను అంబులెన్స్ ద్వారా మెరుగైన వైద్యం కోసం భద్రాచలం, కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగిందన్నారు. ఈ ప్రమాదానికి కారణమేంటని విద్యార్థులను ఆరా తీయగా ప్రస్తుతం ప్రమాదం జరిగినటువంటి బస్సు గతంలో పలుమార్లు స్టీరింగ్ లాక్ అవుతుందని తెలిపారు అన్నారు. యాజమాన్యానికి తెలిపినగాని వారు పట్టించుకోకపోగా, విద్యార్థులను కాలేజీకి వస్తేరండి లేకపోతే లేదు అని దురుసుగా సమాధానం చెప్పేవారని తెలిసిందన్నారు. జరిగిన ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత కె.ఎల్.ఆర్ కాలేజీ యాజమాన్యం మూలానే జరిగిందని తెలుస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రతి విద్యార్థిని కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించి వారి వైద్య ఖర్చులను పూర్తిగా యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేసారు. లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ తరపున తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేఎల్ఆర్ కళాశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు. ప్రతిరోజు దాదాపు 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన బస్సు ఇలా ఫిట్నెస్ లేని కారణంగా ప్రమాదానికి గురైందని స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. ఇలాంటి కాలం చెల్లిన బస్సులను ఉన్నతాధికారుల తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేసారు. విద్యార్థుల దగ్గర పెద్దఎత్తున ఫీజులు వసూలు చేస్తూ ఇలాంటి కాలం చెల్లిన బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలాడున్న కళాశాల యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల ఇంత నిర్లక్ష్యం వహించిన యాజమాన్యంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలియజేసారు. గాయపడిన ప్రతి విద్యార్థి ధైర్యంగా ఉండాని, అందరూ త్వరగా కోలుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అన్ని కళాశాలల, పాఠశాలలలో విద్యార్థులను తరలిస్తున్న బస్సుల పరిస్థితిపై రవాణాశాఖ అధికారులు పరిశీలన చేపట్టి ఫిట్నెస్ ఉన్న వాహనాలనే కళాశాలల యాజమాన్యం నడిపేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# గిరిజనుల ఇండ్ల కూల్చివేత



- **రాష్ట్ర ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన బాధితులు**

**మొయినాబాద్, విశాలభారతి:** గిరిజన కుటుంబాల ఇండ్ల కూల్చివేతల వివాదం జాతీయ ఎస్టీ కమిషన్కు చేరింది.గిరిజనుల ఇండ్ల కూల్చివేతల వివాదం చిలికి చిలికి గాలి వానగా మారింది. ఇండ్లు కూల్చివేయించిన చేయించిన వ్యక్తులకు, ఇండ్లను కూల్చిన మున్సిపల్ అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకోనుంది. ఇండ్లను కూల్చివేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, శుక్రవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు ఉషనానాయక్కు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో కూల్చివేతలో ఇండ్లు కోల్పోయిన గిరిజన బాధితులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటి పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలోని 210,211,212 నంబర్లలో 16 ఎకరాల్లో రాఘవేంద్ర కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చేసిన వెంచర్లో పాత మహబూబ్నగర్కు చెందిన 50 గిరిజన కుటుంబాలు ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్నాం.ఇండ్లు కట్టుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారు గుడిసెలు వేసుకుని పిల్లాపాపలతో నివాసం ఉంటూ కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మీరు ఇండ్లు కట్టుకున్న ఇంటి స్థలాలు మాకు సంబంధించినవని ఇండ్లు కాలి చేసి వెళ్లి పోవాలని గత ఏడాది నుంచి శ్రీనివాస్గు,డి సురేష్ రెడ్డి, శ్రీనివాస్లు అనే ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా వేదిస్తూ వచ్చారు. ఎప్పటికైనా తమ ఇండ్లు కూల్చివేస్తామని భయభ్రాంతులకు గురిచేయడంతో కొంత మంది గిరిజనులు హైకోర్టును ఆశ్రయించి స్టే కూడ తెచ్చుకున్నామని చెప్పారు. కాని సదరు వ్యక్తులు మంగళవారం తెల్లవారు జామున పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో పాటు 100 బౌన్సర్లతో మున్సిపల్,టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి నిద్రపోతున్న మమ్మలను పిల్లలను బలవంతంగా ఇంట్లో నుంచి పోలీసులతో గెంటి వేయించారు. సామాగ్రిని కూడ తీసుకోనివ్వకుండ జేసీబీలతో ఇండ్లను పది నిమిషాల్లో నేల మట్టం చేసి మమ్మలను రోడ్డు పాలు చేశారని ఎస్టీ కమిషన్ సభ్యుడికి తమ ఆవేదన చెప్పుకున్నారు.కులం పేరుతో దూషించి ఇక్కడి నుంచి వెళ్లిపోకపోతే చంపేస్తామని బెదిరించారని పేర్కొన్నారు.ఇండ్లు కూల్చివేయడానికి వచ్చిన వెంటనే పోలీసులు తమ వద్ద నుంచి సెల్ఫోన్లు బలవంతంగా గుంజుకున్నారని, బైక్ తాళం చెవిలు తీసుకున్నారని ఎవరిని ఎటు వెళ్లనివ్వకుండ మా చుట్టుముట్టు పోలీసులు, బౌన్సర్లు ఉన్నారని చెప్పారు. ఇండ్లు కూల్చే ముందు విద్యుత్ సరఫరాను నిలిపివేసి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని తెలిపారు. అందరం ప్రాణ భయంతో తల్లడిల్లిపోయామని ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి అని చెప్పారు.శ్రీనివాస్ రాజు, సురేష్రెడ్డి, శ్రీనివాస్ గౌడ్లకు ఓ పోలీసు ఉన్నతాధికారి అండదండులు పుష్కలంగా ఉన్నాయని ఆయనకు వివరించారు.తమకు న్యాయం చేయాలని ఆయనకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇండ్ల కూల్చివేతల్లో మున్సిపల్ అధికారులు అత్యుత్సహం చేశారని మున్సిపల్ కమిషనర్ మీద కూడ ఫిర్యాదు చేశారు. ఆయన తమరికి న్యాయం చేస్తానని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ ప్లాట్లు తమకు ఉంటాయని మనోధైర్యం ఇచ్చారు. వెంటనే జాతీయ ఎస్టీ కమిషన్కు కూడ ఆయన ఫిర్యాదు చేశాడు. ఆయనను కలిసిన వారిలో నాయకులు ఎం శ్రీకాంత్, సుదీంద్రశర్మ, కృష్ణయాదవ్,గిరిజన బాధితులు ఉన్నారు.

## గౌరెల్లి గుట్టపై శివ కేశవుల క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రం ప్రత్యేక పూజలు





**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మేట్ :** అబ్దుల్లాపూర్‌మేట్ మండలం గౌరెల్లి గ్రామ గుట్టపై స్వయంభుగా వెలసిన శివ కేశవుల క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివాలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. నేడు (శనివారం) ఉదయం 8.00 గంటల నుంచి శివుడికి రుద్రాభిషేకం, రుద్రహోమం మహా పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని శ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి, శివాలయ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సమస్త గ్రామ ప్రజలు, యావత్ శివయ్య భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్ తోపాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు తోపాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై



**కొల్లూరు, విశాలభారతి:** లంచం తీసుకుంటూ ఓ పోలీస్ అధికారి ఏసీబీ వలకు చిక్కాడు. రూ.20 వేలు తీసుకుంటుండగా కొల్లూరు ఎస్సై రమేశ్‌ను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి అధికారులు మారడం లేదు. గతేడాది ఏసీబీ రికార్డు స్థాయిలో కేసులు నమోదు చేసింది. మొత్తం 199 కేసులు పెట్టింది. అనేక మంది అవినీతి అధికారులను అరెస్ట్ చేసింది. అయినా కూడా లంచాలకు మరిగిన అధికారులు మారడం లేదు. తాజాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడులు చేపట్టింది. ఓ కేసు నుంచి తప్పించేందుకు లారీ ఓనర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఎస్సై రమేశ్‌ను పట్టుకుంది. ఓ లారీ ఓనర్‌ను కేసు నుంచి తప్పించడానికి ఎస్సై రూ.30 వేల లంచం డిమాండ్ చేశాడు. గత నెల 17న రూ.5 వేలు తీసుకున్నాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదుదారుడి నుంచి పోలీస్ స్టేషన్‌లో రూ.20 వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు ఎస్సై రమేశ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సోదాలు జరిపారు. ఎస్సై ఆస్తులపై సైతం వివరాలు సేకరించారు. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని అధికారులు తెలిపారు.


## నూతన సంవత్సర వేడుకల్లో గరికపాటి నరసింహారావు



**హైదరాబాద్, విశాలభారతి:** నూతన సంవత్సరం 2026ను పురస్కరించుకుని తార్నాక గోకుల్ నగర్ లోని నిర్వహించిన ఆధ్యాత్మికఎం సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త, సాహితీవేత్త గరికపాటి నరసింహారావు గారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శివశక్తి కళ్యాణోత్సవ వేడుకలలో భాగంగా సాయి సుధీర్ కేటరింగ్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక విలువలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్న గరికపాటి వారి సేవలు అనన్యసామాన్యమని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగర గౌరవ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి కలిసి గరికపాటి నరసింహారావుని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజంలో ధర్మం, ఆధ్యాత్మికత పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. సాంప్రదాయ భక్తిగీతాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో సాగిన ఈ వేడుక నూతన సంవత్సరానికి శుభారంభంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## పార్టీ మారినందుకు ఇంటిపై దౌర్జన్యం

- **భార్యభర్తలపై దాడి.. రూ.50 వేల అపహరణ ఆరోపణ**
- **కురవి పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు**




**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం ఉమ్మడి తట్టుపల్లి గ్రామంలో రాజకీయ ఆరాచకం తారాస్థాయికి చేరుతోంది. గతంలో రాజకీయ ఘర్షణలతో హత్యకు దారితీసిన ఈ గ్రామంలో, కొన్నేళ్లుగా ప్రశాంత వాతావరణం నెలకొన్నప్పటికీ, ఇటీవల స్థానిక ఎన్నికల అనంతరం మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రామంలో కొంతమంది రాజకీయ నాయకులు, అనుచరులు బహిరంగంగా తల్వార్‌లు (కత్తులు) పట్టుకొని పుట్టినరోజుల వేడుకల పేరిట ఫోజులు ఇవ్వడం, పార్టీల ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం వంటి చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలతో గ్రామంలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి ఆరాచకాలకు పాల్పడుతున్న వారిపై నిఘా వేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.

**పార్టీ మారినందుకే దాడి చేసినట్లు ఆరోపణ**

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆరెస్ పార్టీలోకి మారిన కారణంగా తమ ఇంటిపై దౌర్జన్యం జరిగిందని, భార్యభర్తలపై దాడి చేసి రూ.50 వేల నగదును అపహరించారని చంద్యాతండా (తట్టుపల్లి) గ్రామానికి చెందిన బోడ రజిత-బహుసింగ్ దంపతులు ఆరోపించారు. ఈ మేరకు కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు బోడ రజిత శుక్రవారం తెలిపారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, డిసెంబర్ 31న గ్రామ సర్పంచ్ బోడ జామ తన భార్య సమ్మక్కతో పాటు అనుచరులతో కలిసి తమ ఇంటి వద్దకు వచ్చి, భర్త బహుసింగ్ ఇంట్లో లేని సమయంలో ఇంటి స్లాబ్‌పైకి ఎక్కి రాళ్లతో దాడి చేశారని, మహిళ అని చూడకుండా అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. మరుసటి రోజు జనవరి 1న సర్పంచ్ తన అనుచరులతో మళ్లీ ముకుమ్మడిగా ఇంట్లోకి చొరబడి రూ.50 వేల నగదును అపహరించడంతో పాటు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ సమయంలో ఇంటికి వచ్చిన భర్త బోడ బహుసింగ్ దౌర్జన్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించగా, అతనిపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. పోలీసులను ఆశ్రయించిన బాధితులు ఈ ఘటనలపై కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలు బోడ రజిత-బహుసింగ్ దంపతులు పోలీసులను కోరారు.

# బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్' సునామీ..


బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం రూ.1000 కోట్ల వసూళ్లను రాబట్టగా.. ఇంకా బాక్సాఫీస్ వద్ద దూసుకెళుతుంది. అయితే ఈ నేపథ్యంలోనే ఈ చిత్రానికి లడఖ్ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వం పన్ను మినహాయింపును ప్రకటించింది.లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తా ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సినిమా షూటింగ్ అధిక భాగం లడఖ్‌లోని లొకేషన్లలో జరగడం వల్ల, అక్కడ పర్యాటక రంగం మరింత పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే లడఖ్‌ను అంతర్జాతీయ సినిమా షూటింగ్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఈ వెసులుబాటు కల్పించారు. చిత్రంలోని బలమైన దేశభక్తి ఇతివృత్తం కూడా ఈ పన్ను మినహాయింపుకు ప్రధాన కారణంగా నిలిచింది.'ఉరి' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్ 5, 2025న విడుదలై బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. కేవలం కొద్ది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.1100 కోట్ల మైలురాయిని దాటి 2025లో అతిపెద్ద హిట్‌గా అవతరించింది. రణ్‌వీర్ సింగ్‌తో పాటు ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్ మరియు అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు ఈ స్పై థ్రిల్లర్‌లో నటించారు.





## సాయి కుమార్ కెరీర్‌లోనే
# బిగ్గెస్ట్ హిట్

టాలీవుడ్ యువ నటుడు ఆది సాయి కుమార్ ప్రధాన పాత్రలో నటించిన మిస్టరీ హారర్ థ్రిల్లర్ 'శంబాల' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదలైన ఈ చిత్రం మొదటిరోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతూ వారం రోజుల్లోనే రూ. 16 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. దీంతో ఆది సాయి కుమార్ కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ అని ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, విభిన్నమైన కథాంశం మరియు ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. క్రిస్మస్ సెలవుల అనంతరం కూడా థియేటర్ల వద్ద సందడి తగ్గకపోవడం విశేషం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ మార్కును దాటేసిన ఈ సినిమా, రెండో వారంలోనూ మరిన్ని వసూళ్లు రాబట్టే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



## మాస్ మహారాజా.. హుషారెత్తిస్తున్న
# వామ్మో.. వాయ్యో.. సాంగ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. క్లాస్ చిత్రాల దర్శకుడు కిషోర్ తిరుమల దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మేకర్స్ తాజాగా ఈ సినిమాలోని 'వామ్మో.. వాయ్యో..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియా తనదైన మాస్ బీట్స్‌తో స్వరపరిచిన ఈ పాటకు దేవ్ పవార్ సాహిత్యం అందించగా, స్వాతిరెడ్డి తన గాత్రంతో పాటకు మరింత హుషారుని తీసుకువచ్చారు. రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం కిషోర్ తిరుమల మార్కు ఎమోషన్స్‌తో పాటు, రవితేజ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా సాగే పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది.



## తినిపించడంలోనే
# ఆయనకు ఆనందం

ఈ మధ్యకాలంలో అటు ప్రత్యక్షంగానూ, ఇటు పరోక్షంగానూ చర్చల్లో నిలిచింది అందాలభామ నిధి అగర్వాల్. ఈ హడావిడిలోనే ఆమె కథానాయికగా నటించిన 'ది రాజాసాబ్' సినిమా కూడా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న నిధి అగర్వాల్... హీరో ప్రభాస్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'మితాహారం ఎవరికైనా అగ్ని పరీక్షే. ముఖ్యంగా మేమైతే ఇష్టమైన ఫుడ్‌ని ధైర్యంగా తినలేం. తిండిని తగ్గించుకుంటేనే ఇక్కడ ఎక్కువకాలం ఉండగలుగుతాం. కానీ 'ది రాజాసాబ్' సెట్‌లో మాత్రం నేను కంట్రోల్‌లో ఉండలేకపోయా. నేనేకాదు.. నా తోటి హీరోయిన్లు ఇద్దరూ కూడా.దానికి కారణం ప్రభాస్. ఆయన ఎదుటివారి డైట్ చెడగొట్టడంలో ముందుంటారు(నవ్వుతూ). కానీ ఆయన మాత్రం సెట్‌లో ఫ్రూట్స్ మాత్రమే తింటారు. ప్రతిరోజు ప్రభాస్ ఇంటి నుంచి ఓ క్యారియర్ వస్తుంది. అందులో సుమారు పది రకాల ఐటమ్స్ ఉంటాయి. వాటి స్మెల్ చూశాక తినకుండా ఉండలేం. భోజనప్రియులు రెండు రకాలుంటారు. వారిలో తింటానికి ఇష్టపడేవారు కొందరైతే.. తినిపించడానికి ఇష్టపడేవారు కొందరు. ప్రభాస్ రెండో టైప్. ఆయన తినిపించి ఆనందపడుతుంటారు.' అని చెప్పుకొచ్చింది నిధి అగర్వాల్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.